# మిషన్ భగీరథ ఇంటింటి సర్వే 97 శాతం పూర్తి

-రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్


గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

సంగారెడ్డి బ్యూరో, జూన్22 ప్రభాతవార్త: మిషన్ భగీరథ ఇంటింటి సర్వే 97 శాతం పూర్తయిందని, రాబోవు రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లాలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌లపై ఇంటింటి సర్వే నిర్వహణ తీరుపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌లపై ఇంటింటి సర్వేలో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేను మండలాల వారీగా ప్రణాళిక బద్ధంగా ఈ సర్వే అత్యంత పాదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ త్రాగునీరు ప్రతి ఇ ంటికి అందాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాల కలవని, త్రాగునీరు సరఫరా లేని ఆవాసాలు, ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యను పరిష్కరిచేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వేను ప్రారంభించిందని, దీన్ని క్షేత్రస్థాయిలో నిర్ధేశిత గడువులోగా పూర్తి చేసే దిశగా బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ గూగుల్ మీట్‌లో జిల్లా పంచాయితీ అధికారి యాదయ్య, సంబంధిత ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన కేంద్రాలను ఉపయోగించుకోవాలి

-జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సంగారెడ్డి బ్యూరో, జూన్22 ప్రభాతవార్త: ఎన్నికల కోడ్ సందర్భంగా నిలిపివేసిన ప్రజా పాలన సేవా కేంద్రాలను పున:ప్రారంభించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మెదక్ జిల్లా చేగుంట ఎంపీడీవో కార్యాలయంలో గల ప్రజా పాలన సేవా కేంద్రాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆగిపోయిన ప్రజా పాలన కేంద్రాలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజా పాలన కేంద్రాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాలలో ఉన్న సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ ప్రజా పాలన సేవా కేంద్రాలలో గతంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తుల్లో తప్పొప్పులు ఉన్నట్లయితే ఈ సేవా కేంద్రాల ద్వారా సరిదిద్దుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట చేగుంట మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# స్పీకర్‌ను కలిసిన ఎంపి శెట్కార్


స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు పుష్పగుచ్చం అందిస్తున్న ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్

నారాయణఖేడ్ జూన్ 22, ప్రభాతవార్త: శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను శనివారం జహీరాబాద్ ఎంపి సురేశ్ కుమార్ శెట్కార్ మర్యాద పూర్వకంగా కలుసుకుని పులగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ సైతం ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్‌ను సన్మానంచి శుశాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీలో గ్రూపులను ప్రోత్సహిస్తే సహించేదిలేదు

-ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ


మంత్రి కొండా సురేఖను కలిసిన నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్, జూన్ 22 (ప్రభాతవార్త): రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మక నియోజకవర్గం గజ్వేల్ నియోజకవర్గమని, కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించాలనే దురుద్దేశంతో గ్రూపులు ఏర్పాటు చేస్తే సహించేదిలేదని ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో మాజీ కార్పోరేషన్ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డిలతో కలిసి ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖను కలిశారు. గజ్వేల్ నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను ఆమె దృష్టికి తెచ్చారు. పదువులు రాలేదని కొంతమంది పనిగట్టుకొని పార్టీకి నష్టం కలిగేలా ప్రోత్సహిస్తూ పార్టీకి చేటు చేస్తున్నట్లు తెలిపారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి పనిచేయని వారు సైతం తమ పార్టీ పదవులను అడ్డుపెట్టుకొని గ్రూపులుగా విభజిస్తున్నట్లు ఆమె దృష్టికి తెచ్చారు. గాంధీభవన్ కేంద్రంగా ఉంటూ గజ్వేల్‌లో గ్రూపులను ప్రోత్సహించడం ఏమాత్రం తగదని, పార్టీ అధిష్టానం దృష్టి సారించి వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీనిపై స్పందిస్తూ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు పూర్తిగా తనకు తెలుసని, నర్సారెడ్డి పనితీరుపై తనకు పూర్తి నమ్మకం ఉందని, మూడు దశాబ్దాలుగా అంకితభావంతో పనిచేస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేసినట్లు గుర్తు చేశారు. గత పదేళ్లుగా నర్సారెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయగా, పార్టీ పిలుపు మేరకు ఎన్నో కార్యక్రమాలు విజయవంతం చేసినట్లు తెలిపారు. గజ్వేల్ ఇంచార్జి నర్సారెడ్డికి సిఎం రేవంత్‌రెడ్డితో పాటు పార్టీ అధిష్టానం అండగా ఉంటుందన్నారు. క్రమశిక్షణ కలిగిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంచార్జి సూచనల మేరకు పనిచేయాలి తప్ప పనిగట్టుకొని పార్టీపై దుష్ప్రచారం చేస్తూ పత్రికలకు ఎక్కితే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని, పార్లమెంట్ ఎన్నికల్లో గజ్వేల్ నుండి చక్కటి ఫలితాలు రాగా, పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే నియోజకవర్గ ఇంచార్జి సూచించిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర యువజన మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సమీర్, శివారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, సుభాష్‌చంద్రబోస్, గాడిపల్లి శ్రీనివాస్, అంజద్, సురేష్, చంద్రయ్య, శ్రావణ్‌కుమార్, సుదర్శన్, గుండు లక్ష్మణ్, నక్క రేగొండ, బిక్షపతి, శివులు, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# భవన నిర్మాణ సెంట్రింగ్ డబ్బల చోరీ కేసును చేధించిన కౌడిపల్లి పోలీసులు

-రూ. 99 వేల నగదు, వాహనాలు స్వాధీనం

-కౌడిపల్లి ఎస్సై, కానిస్టెబులను అభినందించిన జిల్లా ఎస్పీ


సెంట్రింగ్ డబ్బలను చోరీచేసిన దుండగులను విలేకర్ల సమావేశంలో ప్రవేశపెట్టిన పోలీస్ అధికారుల దృశ్యం.

కౌడిపల్లి, జూన్ 22, ప్రభాతవార్త: భవన నిర్మాణ కార్మికుల జీవనోపాధైన సెంట్రింగ్ డబ్బలను గుర్తు తెలియని దుండగులు ఆపహరించిన కేసును ఛేధించి, 10 మంది దుండగులను ఆరెస్టు చేసి, వారి నుండి రూ. 99 వేల నగదూ, ఆటో ట్రాలీ, ప్యాసింజర్ ఆటో, ఒక బైక్‌ను కౌడిపల్లి పోలీసులు శని వారం నాడు స్వాదీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ బాల స్వామి తెలిపారు. కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చోరీ వివారలను జిల్లా ఎస్పీ బాలస్వామి వివరించారు. ఈ నెల 11వ తేదీన కౌడిపల్లి మండలంలోని నాగుసాన్ పల్లి గ్రామంలో ఆల్మాయిపేట దశరథ కోత్త ఇంటి నిర్మాణం కొరకు భవన నిర్మాణ కార్మికుడైన పెద్దాపురం ఆశోక్ 200 సెంట్రింగ్ డబ్బాలు పెట్టి మరుసటి రోజు యాదవిధిగా తెల్లవారు ఉదయం 8 గంటలకు వచ్చి చూడగా సెంట్రింగ్ డబ్బాలు కనిపించక పోవడంతో కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో 12వ తేదీన ఫిరా ్యదు చేసినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసుకున్న స్థానిక ఎసై ్స రంజిత్ కుమార్ రెడ్డి విచారణ లో భాగంగా కౌడిపల్లి ఎస్సై జిల్లా ఎస్పీ ఆదేశాలతో కేసు దర్యాప్తును వేగవంతం చేయుటకు గాను రెండు బృందాలుగా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలలో ఎక్కడెక్కడైన సెంట్రింగ్ డబ్బాలు దొంగతనం జరిగినాయ అని సాంకేతిక పరిజ్ఞానాన్ని అయిన సిసి కెమెరాలను పరిశీలించగా కొంత మంది వ్యక్తులు రాత్రిపూట నూతనంగా నిర్మాణం చేసే భవనాల వద్దకు వచ్చి సెంట్రింగ్ డబ్బాలను దొంగతనం చేసి, ట్రాలీ ఆటోలో తీసుకోని వెళ్లుతున్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. డబ్బాల దొంగతనం కేసు దర్యాప్తులో భాగంగా ఎస్సై రంజిత్ కుమార్ తన సిబ్బందితో శుక్రవారం నాడు రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, శని వారం తెల్లవారు జామున ఒక ట్రాలీ ఆటో, ఒక పాసింజర్ ఆటో మరియు బైక్‌పై కొంత మంది వ్యక్తులు రాగా ఎస్సై వారిని ఆపగా, పోలీస్ వాహనాన్ని చూసి పారిపోతుండగా తన సిబ్బందితో కలిసి పారిపోతున్న వ్యక్తులను పట్టుకొని విచారించగా సెంట్రింగ్ డబ్బాలను దొంగతనం చేసినట్లు నేరాని ఒప్పుకోవడం జరిగిందని ఎస్పీ తెలిపారు. వడ్డెర వృత్తి చేసే యువకులు జలా ్సలకు ఆలవాటు పడిన 10 మంది యువకులు సెంట్రింగ్ డబ్బాలను దొంగతనం చేసిన వాటిని మహబూబ్‌నగర్‌జిల్లా మక్తలు మండలం మద్వార్ గ్రామానికి చెందిన ఇనుపతుక్కు వ్యాపారి నారాయనోళ్ల నింగప్పాకు పలపనూర్ గ్రామం వద్ద విక్రయించినట్లు ఆయన తెలిపారు. దుండగుల నుండి డబ్బాలను విక్రియంచిన రూ. 99 వేల నగదూ, రూ. 3 లక్షల విలువ గల ఒక ట్రాలీ ఆటో, ఒక ప్యాసింజర్ ఆటో నం. ఎపి 23 డబ్లూ ్య 8557, ఒక బైక్, 255 సెం ట్రింగ్ డబ్బాలు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. దొంగతనం పాల్పడిన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన వడ్డెర యువకులు 1. మక్కాని నవీన్ సంగారెడ్డి 2. ద్యారంగుల అనిల్ కొల్చారం, మెదక్‌జిల్లా, 3. వడ్డె సంపంగి విజయ్ సంగారెడ్డి, 4.మక్కాని పవన్ సంగారెడ్డి, 5.వడ్డె శ్రీకాంత్ సంగారెడ్డి, 6.ద్యారంగుల అలీయాస్ వడ్డె యాదయ్య కోల్చారం, మెదక్ జిల్లా, 7.ద్యారంగుల అలీయాస్ వడ్డె దుర్గాప్రసాద్ కొల్చారం మెదక్ జిల్లా. 8.వాదిల అలీయాస్ వడ్డే దుర్గాప్రసాద్ పాపన్నపేట, మెదక్ జిల్లా, 9.ద్యారంగుల శ్రీనివాస్ కోల్చారం మెదక్ జిల్లా, 10. దండుగుల ప్రవీన్ అల్లాదుర్గ్ మెదక్ జిల్లా దుండగులతో పాటు ఇనుప తుక్కు వా ్యపారిని నారాయణోళ్ల నింగప్పాలను ఆరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభా కనబర్చిన కౌడిపల్లి ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి మరియు పోలీస కానిస్టేబుల్ బాగయ్య, ఉపేందర్, శ్రీకాంత్‌లను ఎస్పీ బాల స్వామి అభినందించిడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈయన తోపాటు తూప్రాన్ డీఎస్పీ వెంకట రెడ్డి, నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి, కౌడిపల్లి ఎస్సై, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ నియోజకవర్గంలో నర్సారెడ్డి పనితీరు బాగుంది

-ఆయన ప్రతిపాదించిన వారికే నామినేటెడ్ పదవులు

-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


మంత్రి నాగేశ్వర్‌రావుకు నామినేటెడ్ పోస్టుల ప్రతిపాదన పత్రాన్ని అందజేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, జూన్ 22 (ప్రభాతవార్త): గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పనితీరు బాగుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కష్టపడే మనస్తత్వం కలిగిన తూంకుంట నర్సారెడ్డికి మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. దశాబ్ద కాలంగా తనకు నర్సారెడ్డితో అనుబంధం ఉందని గుర్తుచేశారు. రాష్ట్రంలోనే గజ్వేల్ నియోజకవర్గ పరిస్థితులు భిన్నంగా ఉండగా అక్కడ నెట్టుకురావడం అంత సులభం కాదన్నారు. నర్సారెడ్డికి సిఎం రేవంత్‌రెడ్డి వద్ద మంచి పలుకుబడి ఉందని, ఆయన సూచించిన అభ్యర్థులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వనున్నట్లు తేల్చేశారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ నియామకంపై నర్సారెడ్డి సూచించిన పేర్లతో రెండు రోజుల్లో జీఓ విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గౌరవం ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రూపులను పక్కనపెట్టి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. మొదటగా గజ్వేల్‌తో అనుబంధం ఉన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలిసి నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ కార్పోరేషన్ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్, శ్రీనివాస్, సుభాష్‌చంద్రబోస్, మతీన్, సర్దార్‌ఖాన్, సమీర్, భానుప్రసాద్ తదితరులు ఉన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

-జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి టౌన్, జూన్ 22, ప్రభాతవార్త: మాదక ద్రవ్యాల నియంత్రణకు జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. శనివారం సంగారెడ్డిలోని ఐసిసి సముదాయం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ కొరకు చేపట్టిన చర్యలపై పోలీసు, అబ్కారి శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణ కొరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పిల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యువత అలవాట్లకు దూరంగా ఉండేలా ప్రచారం కల్పించాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు, రవాణా జగరకండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాలయాలకు దూరంలో మద్యం దుకాణాలు ఉండాలని, బెల్ట్ షాపులపై ఫిర్యాదులు వస్తే మూసి వేయించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాఠశాలలకు దగ్గరలోని దుకాణాలు, టీ కొట్టులు, పాన్ షాప్‌లను తనిఖీ చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అదికారి నవీన్ చంద్ర, జిల్లా వైద్య అదికారి డాక్టర్ గాయత్రి దేవి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వసంత కుమారి, డిఈఓ వెంకటేశ్వర్లు, పోలీసు అధికారులు, ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపాళ్ల పాల్గొన్నారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

-పలుశాఖల అధికారులు గైర్హాజరు

రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 22, ప్రభాతవార్త : రామాయంపేట మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ప్రస్తుత పాలకవర్గంకు సంబంధించి ఇదే చివరి సమావేశం కానుంది. శనివారం నాడు స్థానిక ఎంపిపి బిక్షపతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు ఎంపిటీసీలు హాజరైనప్పటికీ పలు శాఖల అధికారులు హాజరు కాలేదు. సభ ప్రారంభం కాగానే తొనిగండల్ల ఎంపిటీసీ నాగులు ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంపై నిలదీసారు. 200 యూనిట్ల ఉచిత కరెంటుపై ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో లబ్దిదారులకు అత్యధిక కరెంట్ బిల్లులు రావడం జరుగుతుందని అన్నారు. దీనిపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ట్రాన్స్‌కో అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై రామాయంపేట ట్రాన్స్‌కో ఏఈ పెంట్యానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన వెబ్‌సైట్ ఇంతవరకు ఓపెన్ కాలేదని తెలిపారు. వెబ్‌సైట్ ప్రారంభం కాగానే సమస్యలన్ని తీరిపోతాయని అన్నారు. ఆయన సమాధానానికి తృప్తి చెందని ఎంపిటీసీ నాగులు మాత్రం అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వలన ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తుందన్నారు. ఇండ్లకు, రైతులకు అధిక బిల్లులు రాకుండా వెంటనే వెబ్‌సైట్ ద్వారా ఉచిత కరెంటు 200 యూనిట్ల ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాగా రామాయంపేట మండలంలో 150 పైగా చెరువులు, కుంటలు ఉన్నాయని వాటి మరమ్మత్తులకు ఎటువంటి అవసరం లేదని ఇరిగేషన్ ఏఈ కుషాల్ తెలిపారు. అన్ని కుంటలకు, చెరువులకు కట్టలు ప్రతిష్టంగా ఉన్నాయని, మిషన్ కాకతీయ ద్వారా ఏర్పాటు చేయడం వల్ల వర్షాల వల్ల విపత్తుల ఏర్పడ్డ నీటిపారుదల శాఖ అప్రమత్తంగా ఉందని అన్నారు. మండలంలోని అన్ని చెరువులకు, కుంటలకు ఎలాంటి బుంగలు, కట్టలు తెగిన దాఖలాలు లేవని వర్షాలు పడినా ఎటువంటి ప్రమాదం జరగదని, నీరు చెరువులలో నిల్వ ఉంటుందని కుషాల్ తెలిపారు. మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరిప్రియ మాట్లాడుతూ మండల పరిధిలోని అంగన్వాడి కేంద్రాలకు పౌష్టికాహారాన్ని చిన్నపిల్లల కోసం అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే గర్భవతులు, బాలింతలకు సైతం పౌష్టికాహారం అందజేస్తున్నాం అని తెలిపారు. కాగా ఈ సమావేశానికి ఎక్సైజ్‌శాఖ, ఆర్టీసీ, అటవీశాఖ అధికారులు హాజరు కాలేదు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపిపి స్రవంతి, ఎంపిడివక్ష సాజిలోద్దిన్, ఆర్ఐ రాజుతో పాటు ఆయా గ్రామాల ఎంపిటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ విద్యాసరస్వతి క్షేత్రంలో వైభవంగా మూల నక్షత్ర విశేష పూజలు

-భక్తులతో కిటకిటలాడిన క్షేత్ర సముదాయం


ప్రత్యేక అలంకరణలో శ్రీ విద్యా సరస్వతి అమ్మవారు

వర్గల్, జూన్ 22 (ప్రభాతవార్త): చదువుల తల్లి వర్గల్ శ్రీ విద్యా సరస్వతి క్షేత్రంలో శనివారం మూల నక్షత్ర విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు మూల నక్షత్ర మహోత్సవానికి అంకురార్పణ చేశారు. అనంతరం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, లక్ష పుష్పార్చన, చండీ హోమం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు తమ చిన్నారులకు అక్షర శ్రీకారాలు చేయించుకోగా, క్షేత్రాన్ని దర్శించిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. మూల నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్దసంఖ్యలో తరలిరాగా ఆలయ సముదాయం భక్తులతో కిటకిటలాడింది.

# కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన రమేశ్‌గౌడ్


హైద్రాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ని కలిసిన బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్ తదితరులు

నర్సాపూర్ జూన్ 22. ప్రభాతవార్త : కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డిని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి కమేశ్‌గౌడ్ శనివారం హైద్రాబాద్ లో మర్యాధ పూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వంలో మంత్రి పదవీ చేపట్టినందున ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్ శాలూవాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి నాయకులు,కార్యకర్తలు పగలు రాత్రి అనే తేడాలేకుండా పార్టీ విజయానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఈమేరకు తమకు విజయం అందించిన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మునుముందు కూడ బిజెపి పార్టీని రాష్ట్రంలో భలోపేతం చేసి రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు ఇప్పటి నుండే కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాలొన్నారు.

# కొండ పోచమ్మ సాగర్ కాలువ మాకొద్దు

-మా గ్రామాల్లో భూసేకరణ నిలిపివేయాలంటు గ్రామస్తుల ధర్నా


నర్సాపూర్ ప్రధాన రోడ్డు పై ధర్నా చేస్తున్న భూనిర్వాసిత చిన్నచింతకుంట రైతులను సముదాయిస్తున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్ జూన్ 22. ప్రభాతవార్త : కొండ పోచమ్మ సాగర్ కాలువ మాగ్రామాల నుండి వద్దని ఇందుకోసం చేపడుతున్న భూసేకరణ ను నిలిపివేయాలంటు మండల పరిధిలోని చిన్నచింతకుంట గ్రామస్తులు నర్సాపూర్ పట్టణంలోని రైతు వేదిక వద్ద గల ప్రధాన రోడ్డులో ధర్నా చేశారు. ఈసందర్భంగా కొండ పోచమ్మ సాగర్ మాకొద్దని, భూసేకరణ నిలిపివేయాలంటు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మహేశ్‌గౌడ్, ప్రబాకర్, నర్సింహ్మారెడ్డి, కిష్టాగౌడ్ లు మాట్లాడుతూ మాగ్రామంలో ఇంతకుముందు కాళేశ్వరం కాలువ గురించి భూములు పోయాయి,మరల కొండపోచమ్మ సాగర్ కాలువ కోసం భూసేకరణ చేస్తురన్నారని అన్నారు, రెండు పసళ్ళు పండె పంట భూములు కోల్పోతున్నామని దీంతో రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. తీసుకున్న భూములకు బదులు భూములుఇవ్వాలని లేదంటే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. గతంలో ఉన్న ప్రభుత్వం రైతులను మోసం చేసి పబ్బం గడుపుకుందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసె విదంగా నష్ట పరిహారం ఇవ్వాలని వారు కోరారు. రైతులను ఇబ్బంది పెట్టి భూములు తీసుకుంటే రైతు గోస మంచిది కాదని రైతులకు సరియైన నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. చిన్నచింతకుంట గ్రామస్తులు చేస్తున్న ధర్నాలో చేస్తున్న నినాదాలు విన్న రైతు వేదికలో ఉన్న నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ధర్నా చేస్తున్న రైతుల వద్దకు వచ్చి మాట్లాడుతూ మీకు ఏమైనా అభ్యంతరాలుంటే నా దృష్టికి తీసుకురావాలని కాగా ఇలా రోడ్డు పై భైఠాయించి ధర్నా చేస్తె మీకు ఏమైనా ఉపయోగముందాలని ఆయన రైతులను ప్రశ్నించారు. రైతులకు కావాల్సిన న్యాయం జిల్లా కలెక్టర్ ద్వార జరిగేవిదంగా చూస్తానని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో రైతులు తాము చేస్తున్న ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో మహేశ్‌గౌడ్,నర్సింహ్మారెడ్డి,ప్రబాకర్, కిష్టాగౌడ్, పద్మావతి, లింగంగౌడ్, రమేశ్, ఆంజనేయులు, పోచయ్య, పెంటయ్య,శ్రీనివాస్‌రెడ్డి, కంచం రాములు, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి


కక్కరవాడలో ఏరువాక పౌర్ణమి వేడుకలు జరుపుకుంటున్న రైతులు

ఝురాసంగం, జూన్ 22, ప్రభాతవార్త: మండల కేంద్రమైన ఝురాసంగంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఏరువాక పౌర్ణమిని పర్వదినాన్ని రైతులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. రైతులు తాము సాకుతున్న పశువులను శుభ్రంగా కడిగి రంగులు అద్ది రంగు రంగు తాళ్లతో అందంగా అలంకరించారు. గ్రామాల్లోని ఆలయాల చుట్టూ ఎడ్లతో ప్రదక్షిణలు చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# అవి'నీతి' కొలతలు

**-తూనికలు,కొలతల శాఖలో అవినీతి అధికారులు**
**-ప్రజలను మోసం చేసే వ్యాపారులే వీరి టార్గెట్**
**-పెట్రోల్ బంకులు, గోల్డ్‌షాపులు, మాల్స్‌ల నుంచి లక్షల్లో వసూలు**
**-ఏళ్లుగా ఒకే దగ్గర పాతుకుపోయిన పలువురు అసిస్టెంట్ కంట్రోలర్లు**
**-చూసీ చూడనట్లుగా వ్యవహిస్తున్న ఉన్నతాధికారులు**



**హైదరాబాద్, జూన్ 22,ప్రభాతవార్త:**
దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా తూనికల కొలతల శాఖలో పనిచేస్తున్న కొందరు అవినీతి అధికారులు షాపులను పంచేసుకుంటున్నారు. ప్రైవేట్ సిబ్బందితో అక్రమ వసూళ్లు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారు. నగరంలో చాలా ప్రాంతాల్లో పెట్రోల్‌బంకులు, మాల్స్, గోల్డ్‌షాపులు,కిరాణాదుకాణాలు ఇలా అన్నింట్లోనూ లీగల్ మెట్రాలజీ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్యాకింగ్ మోసాలకు పాల్పడుతున్నారు. ఎమ్మార్పీ ధరలను ట్యాంపరింగ్ చేయడం, ప్యాకింగ్ పరిమాణాలు తగ్గిపోవటం, ఎమ్మార్పీలేకుండానే అధిక ధరలకు విక్రయించడం వంటివి విచ్చలవిడిగా జరిగిపోతున్నాయి. ఈనేపథ్యంలో దీన్ని అరికట్టాల్సిన తూనికలు కొలతలశాఖలోని కొందరు అధికారులు వాటిని క్యాష్ చేసుకుంటున్నరు. మీరు నిబంధనలు పాటించడం లేదంటూ కేసులుపెట్టకుండా వారివద్దనుంటే నెలనెల మామూళ్లు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా బరువు తూచేయంత్రాల తయారీ, మరమ్మత్తు, యంత్రాలు సరిచూసి అధికారుల ఆమోదంతో ధ్రువీకరించేందుకు తూనికలు,కొలతల శాఖ అనుమతులు ఇస్తుంది. అవి పొందిన లైసెన్స్‌దారులు ఆయా వ్యాపారులు త్రాసులను ఏటా మరమ్మత్తు చేసి తనిఖీ అధికారి నుంచి వ్యాపారికి సర్టిఫికేట్ ఇవ్వాలి. ఈక్రమంలో తనిఖీ అధికారి యంత్రాన్ని పరిశీలించి అంతా సక్రమంగా ఉంటే సీలు వేస్తారు. ఈప్రక్రియ పూర్తయిన తర్వాత అధికారుల తనిఖీల సమయంలో బరువు తక్కువగా చూపి వినియోగదారులను మోసం చేస్తున్నట్లు గుర్తిస్తే వ్యాపారితోపాటు సదరు యంత్రం తనిఖీ చేసి లైసెన్స్‌దారుల, తయారీదారులపై చర్యలు తీసుకోవాలి. కానీ ఇందుకు విరుద్ధంగా వ్యాపారులపై కేసులు నమోదు చేసి లైసెన్స్‌దారులను వదిలేస్తున్నారు. అలాగే ఎలక్ట్రానిక్ కాంటాలను అధికారులు తనిఖీ చేసిన తర్వాత సీలు వేసి ముద్ర వేయాల్సి ఉంది. అయితే క్షేత్ర స్థాయిలో వ్యాపారులు ఉపయోగిస్తున్న యంత్రాలకు సీలులేకపోవడం గమనార్హం.

కొందరు వ్యాపారులైతే నేరుగా తయారీదారుల వద్దకు వెళ్ళి బరువు ఎక్కువ చూపేలా యంత్రాల సాఫ్ట్‌వేర్ మార్పుచేయాలని కోరడం గమనార్హం. ఆహారపదర్థాల సంచులపై తయారీదారుడి పేరు, గడువు, బ్యాచ్‌నవంబర్ ,టోల్‌ఫ్రీనెంబర్ ,తయారీదారుని చిరునామా ,గరిష్ట చిల్లధర ముంద్రించాలని నిబంధనలు చెబుతున్నా..ఆచరణలో అమలు కావడం లేదు.

### వసూళ్ల పర్వం ఇలా ..

మరమ్మత్తులు, రెన్యూవల్ పేరుతో లైసెన్స్ దారులు జిల్లా స్థాయి అధికారులు అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఎలక్ట్రానిక్ కాంటాలను సంవత్సరానికి ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలి. మ్యానువల్ కాంటాలను రెండు సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేసుకోవవాలి. రెన్యూవల్ ఫీజు ఒక గ్రాము నుంచి 20కేజీలవరకు పదిరూపాయలు మాత్రమే, 30కేజీలనుంచి 50కేజీల వరకు 40 రూపాయాల ఫీజు ఉంటుంది. కానీ వీరు 2నుంచి 5వేలకవరకు వసూళ్లు చేస్తున్నారు. అలాగే పెట్రోల్ బంకు యజమానుల నుంచి జిల్లా స్థాయి అధికారులకు నెలనెల మామూళ్లు ముట్టుతున్నట్లు అరోపణలు ఉన్నాయి. పెట్రోల్ బంక్‌లో ఉన్న నాజిల్‌ను సంవత్సరానికి ఒకసారి రెన్యూవల్ చేయాలి. రెన్యూవల్ ఫీజు 1720 రూపాయలు ఉంటుంది. కానీ అధికారులు నాలుగింతలు అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే ఇన్‌స్పెక్షన్ పేరుతో ఒక బంకు నుంచి 10లీటర్ల పెట్రోల్, డీజిల్ గానీ తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వేబ్రిడ్జి కాంటాల రెన్యూవల్ చార్జీ 3000లు వరకు ఉంటుంది. కానీ అధికారులు 12,000లవరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో ప్రభుత్వానికి చెల్లించేది 3వేల రూపాయలు మాత్రమే మిగతాది నేరుగా వీరి జేబుల్లోకి వెళ్ళిపోతుంది.

### వీధివ్యాపారులను వదలట్లేదు ..

నగరంలోని పలు ప్రాంతల్లో తూనికలు,కొలతల అధికారులతోపాటు లైసెన్స్‌దారులు వీధి వ్యాపారులను కూడా వదలటం లేదు. తోపుడు బండిపై కూరగాయలు, పండ్లు అమ్ముకునేవారి నుంచి సైతం 500నుంచి 1000వరకు వసూలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరికి బిల్లు కాగితం లాంటివి ఏమీ ఇవ్వరు. ఇన్‌స్పెక్టర్లు ఒక్కసారి బయటకు వచ్చారంటే 40వేలనుంచి లక్ష వరకు వసూళ్లు చేయకుండా ఇంటికి వెళ్లరని వినికిడి. ఏమీలేనిపక్షంలో ఆయా కిరాణషాపుల వద్దకు వెళ్ళి దాన్ని, దీన్ని చూసి దీనికి ఎంఆర్పీ రేట్ లేదు. దీనికి ఎక్స్పైరీ డేట్ అయిపోయింది. అంటూ ఏదో ఒకసాకుతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది.

### కార్యాలయంలో సార్లు ఉండరు...

నగరంలోని తూనికలు కొలతలశాఖ ప్రధాన కార్యాలయం ముషీరాబాద్ గాంధీనగర్‌లో ఉంది. అక్కడ హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ కంట్రోల్, సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో రంగారెడ్డిజిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ కార్యాలయాలు ఉంటాయి. ఇక్కడికి ఫిర్యాదు చేద్దామని వెళ్తే ఏఒక్కరూ కనిపించదు. కార్యాలయం తాళం వేశో ..లేదా ఒక్క అంటేండర్ మాత్రమే కార్యాలయంలో దర్శనమిస్తుంటారు. ఎప్పుడు వెళ్ళినా ఇదే తంతు సార్ వాళ్లు ఎక్కడికి వెళ్ళారని అడిగితే ఏమో నాకు తెలియదు అంటారు. ఇలా అధికారులు రోజూ ఎక్కడికి వెళ్తనారు ..ఏం చేస్తున్నారన్న సమాచారం కార్యాలయం సిబ్బదికి తెలియకుండా ఉంటుంది.

# కార్యకర్తలు, ప్రజల సహకారంతో గెలిచా

**-కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి**
**-తార్నాకలో కిషన్ రెడ్డికి ఘనస్వాతం పలికిన బిజెపి శేణులు**



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**తార్నాక, జూన్ 22 ప్రభాతవార్త :**
కార్యకర్తలు, నాయకుల కష్టం ప్రజల సహకారంతో తాను ఎంపీగా గెలిచి మంత్రిని అయ్యానని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి అయి మొదటి సారి నియోజక వర్గానికి వచ్చిన సందర్భంగా బిజేపీ శ్రేణులు ఆయనను బ్యాండ్ మేళాలతో పూలు చల్లుతూ స్వాగతం పలికారు. బిజేపీ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం పోలింగ్ బూత్ కోఆర్డినేటర్లు అండ్ పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశాన్ని శనివారం తార్నాక విజయపురి కాలనీలో నిర్వహించారు. ఈ సమాశంలో మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోది తనను నమ్మి ఎంతో గొప్ప కోల్ మైన్ శాఖను ఇచ్చారని దానిని లాబాల బాటల్లోకి తీసుకెళ్లుతానని చెప్పారు. కోల్ ద్వార కోటిన్నర ఉద్యోగులు బతుకుతున్నారని వారి సంక్షేమం కోసం తాను కృషి చేస్తానని చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన వన్నింటిని తీసుకొస్తానన్నారు. నియోజక వర్గలంలో ఎన్నో స్థానిక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం కోసం తాను చర్యలు తీసుకుంటానన్నారు.నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ అధికారుల సమన్వయంతో స్థానిక సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. పార్టీలోకి కొత్తవారికి సభ్యత్వం ఇవ్వాలని యువత, మహిళలను పార్టీలో చేర్చుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డును ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ కూడా ఎన్నో హామిలను ఇచ్చంది కాని ఒక్కటి నెరవేర్చలేదని ఆరోపించారు. రెండు పార్టీలను చూశారని బీజేపీని గెలిపించి తమ పాలనను చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెట్లు నాటాలి కాని కేసీఆర్ లాగా హరిత హారంపేరుతో వందల కోట్లను దుర్వినియోగం చేయొద్దన్నారు. నగరంలో మురుగు కాలువల సిష్టం పూర్తిగా దెబ్బతిన్నదని వాటిని జీహెచ్ ఎంసీ సరిచేయాలని సూచించారు. నగరంలో కూలిపోయే స్థితిలో ఉన్న విద్యుత్ స్థంబాలను తొలగించి వాటి స్థానాల్లో సిమెంట్ స్థంబాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న గ్రేటర్ ఎన్నికల్లో మేయర్ స్థానానిన్ని కైవసం చేసుకోబోతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ బండకార్తిక రెడ్డి అద్వర్యంలో కిషన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణితో పాటు పలువురు కిషన్‌రెడ్డికి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజేపీ జిల్లా నాయకులు శ్యాంసుందర్, బండ పల్లి సతీష్ గౌడ్, బిజేపీ అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, రవిప్రకాష్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కనకట్ల హరి, బండ చంద్రారెడ్డి, వీరన్న, కొన్నె సంపత్, శారధ మల్లేష్, పోచయ్య యాదవ్, శ్రీనివాస చారి, జమ్మికుంట వేణు పలువురు పాల్గొన్నారు.

# శ్రీఉజ్జయిని మహాకాళి బోనాల జాతర విజయవంతం చేయాలి

**-వివిధ శాఖల అధికారుల సమావేశంలో**
**నార్త్‌జోన్ డిసిపి సాధన రష్మీ పెరుమాళ్**



బోనాల జాతరకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్.

**బేగంపేట జూన్ 22,ప్రభాతవార్త**
సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి బోనాల జాతర విజయవంతం చేసేందుకు అన్ని ముఖ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. శనివారం శ్రీఉజ్జయినీ మహాకాళీ దేవస్థానంలో ఆమె అన్ని ముఖ్య శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ గత అనుభవనాలను దృష్టిలో ఉంచుకొని ఇంకా ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. జులై 21 న బోనాల జాతర, 22 రంగం, భవిష్యవాణి, అంబారీ ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని, దానికి తగ్గట్లుగా ఆలయానికి వచ్చే మార్గాలతో పాటు ఆలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, భారీ పోలీసు బందోబస్త్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంతో పాటు ఆలయానికి వచ్చే మార్గాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, భక్తులకు క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని, తాగునీటిని అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులు ఆలయానికి వచ్చే మార్గాల్లో వీధిలైట్లు పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వాటర్‌వర్క్స్ శాఖ అధికారులు అమ్మ వారి ఆలయం తో పాటు ఆలయానికి వచ్చే మార్గాల్లో డ్రైనేజీలు పొంగకుండా ,నీరు రోడ్లపై పారకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని డీసీపీ సూచించారు. అలాగే దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ జాం కాకుండా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి, అడిషినల్ డీసీపీ జోనల్ కమీషనర్ రవికిరణ్, డీఎంహెచ్‌ఓ వెంకటి, ఏసీపీ సుబ్బయ్య, డీఎఫ్‌ఓ ధనుంజయ్ మహంకాళీ ఇన్స్ పెక్టర్ పరుశురాం, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్. విద్యుత్, వాటర్‌వర్క్స్ , తదితర ముఖ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎవరికీ లేని ర్యాంక్ నిబంధన బిసి విద్యార్థులకే ఎందుకు ?

**-విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి బిసివిద్యార్థి సంఘం వినతి**

**హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త:**
బిసివిద్యార్థులకు ఇంజనీరింగ్ అడ్మిషన్లలో పదివేల ర్యాం క్ నిబంధన ఎత్తివేయాలని ..ఎవరికీ లేనిర్యాంకు నిబంధ న కేవలం బిసి విద్యార్థులకే ఎందుకని బిసివిద్యార్థి సం ఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రంగౌడ్ బిసి, విద్యాశాఖ ప్రిన్సి పల్ సెక్రటరీ బూర వెంకటేశంను ప్రశ్నిం చారు. ఈమేరకు శనివారం ఆయన ఆకార్యలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అలు అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విక్రంగౌడ్ మాట్లాడుతూ 2008లో నాటి ప్రభుత్వంతో కొట్లాడి ఫీజుల రియంబర్స్ మెంట్ స్కీం సాధించామన్నారు. బిసి ఈలో ఉన్న ముస్లిం,మైనార్టీలకు ర్యాకులతో సంబంధం లేకుండా పూర్తిఫీజులు ఇస్తున్నారని కానీ బిసివిద్యార్థులకు మాత్రం పదివేల ర్యాంకు నిబంధనల పెట్టి మిగిలిన వారికి 35000 వేలు మాత్రమే ఇస్తున్నారని దానివల్ల టాప్‌టెన్ కాలేజెస్‌లో బిసవిద్యార్థులకు సీట్లు వచ్చినా అట్టి ఫీజులు లక్ష నుంచి 2లో ఉండటంతో కట్టలేక చదువుకు దూరం అవుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడితే విద్యార్థులకు ర్యాంకు నిబద్దత ఎత్తివేస్తామని ఎస్సీ,ఎస్టీ, మైనార్టీల లాగానే బిసివిద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు చెల్లిస్తామని కాంగ్రెస్ మెనిఫెస్టోలో పెట్టారని కాబట్టి పదివేల ర్యాంకు నిబంధన ఎత్తివేసి బిసి విద్యార్థులకు న్యాయం చేయాలని విక్రంగౌడ్ కోరారు.

## అర్హులందరికి కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులు

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :**
అంబర్‌పేట నియోజకవర్గంలో అర్హులందరికి కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ పథకం వర్తింప చేస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం అంబర్‌పేటలోని ఎస్ఆర్‌జి ఫంక్షన్ హాల్‌లో 156 మందికి కళ్యాణలక్ష్మీ, షాది ముబా రక్ చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మవెంకట్‌రెడ్డి, నల్లకుంట కార్పొరేటర్ ఎన్.అమృతలతో కలిసి ఆయన చెక్కులు పంపిణి చేశారు. ఇందులో 99 మందికి కళ్యాణ లక్ష్మీ, 57 మందికి షాది ముబారక్ పథకం కింద చెక్కులు అందుకున్నారు.

# ఇష్టారాజ్యంగా రోడ్డుపై షెడ్డు

**-టౌన్‌ప్లానింగ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నట్లా? లేదా?**
**-రోడ్లను ఆక్రమించుకున్నా పట్టించుకోరా?**





లోయర్‌ట్యాంక్ బండ్‌లోని సాయిబాబా ఆలయం సమీపంలోని జలవాయు టవర్స్‌కి వెళ్లే మార్గంలో ఆర్చ్ వద్ద అక్రమంగా షెడ్ నిర్మాణం చేశారు. ఈ ప్రాంతంలో షెడ్ నిర్మాణం

**హైదరాబాద్, జూన్ 22 ప్రభాతవార్త**
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జిహెచ్‌ఎంసి) పరిధిలో ముషీరాబాద్ సర్కిల్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారా? లేదా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమంగా నిర్మాణాలు, కట్టడాలు నిర్వహిస్తుంటే చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లోయర్ ట్యాంక్‌బండ్ సమీపంలో రహదారి మీద అక్రమ షెడ్ వేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ రహదారి నుంచి వెళ్లే వాహన దారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపై షెడ్లు వేసి ఆక్రమించుకుంటుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చేయవద్దని స్థానికంగా ప్రజలు పలు సార్లు వ్యతిరేకించినప్పటికీ అవేవి పట్టించుకోకుండా దౌర్జ్యంగా షెడ్ వేశారు. రోడ్డుపై అక్రమ షెడ్డు నిర్మాణం వల్ల ఆ రూట్‌లో వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.నగరంలోని టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎప్పటికప్పుడు అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సింది పోయి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణం జరిగే సమయంలోనే ఈ అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సి ఉండగా, నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు వేచి చూడటం, ఆ తరువాత సదరు అక్రమ నిర్మాణదారులతో స్థానిక అధికారులు కుమ్మక్కు అవడం ఆనవాయితీగా మా రింది. నగరంతో పాటు శివారు ప్రాంతాలలో రోడ్లపై అక్రమ షెడ్ల నిర్మాణాలు విచ్చల విడిగి పెరిగిపోతు న్నాయి. ఈ విషయంలో ఉన్నతాధి కారులు కఠినంగా వ్యవహరించడం తో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది. జిహెచ్ ఎంసి ప్రధాన కార్యాలయం సమీపంలోనే ఉన్న ఈ అక్రమ షెడ్ నిర్మాణం రోడ్ మీదను ఉంది. దీన్ని అడ్డుకోకుండా, నిర్మాణం పూర్త య్యేంత వరకు అధికారులు వేచి చూసారంటే అధికారుల నిర్లక్ష్యం ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా అదికారులు స్పందించి అక్రమ షెడ్డును కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

## డిఫెన్స్,రెవెన్యూ శాఖలు ఉమ్మడి సర్వే చేయాలి

**-భూ సరిహద్దు సమస్యలను త్వరగా పరిష్కరించాలి**
**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త:**
రక్షణశాఖ, రెవెన్యూశాఖ భూముల సరిహద్దులకు సంబంధించిన సమస్యలను ఉమ్మడి సర్వే నిర్వహించి త్వరగా పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈమేరకు శనివారం బొల్లారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయ సమావేశ మందిరంలో బ్రిగేడియర్ సోమశ కంర్ ఎస్ఎంతో కలిసి రక్షణ, రెవెన్యూశాఖ అధికారులతో భూమి సరిహద్దు సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆరుఅంశాలపై విపులంగా నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. 1.సంయుక్త సర్వేలు, సరిహద్దు నిర్ణయాలు, 2.రక్షణ భూ ఆక్రమణలు, 3.అలాట్మెంట్ (సైనిక స్కూల్ భూమి వివరాల గురించి ), 4.రెగ్యులేషన్ (రక్షణశాఖ భూఆక్రమణల క్రమబద్దీకరణ), 5, ఓటు వివాదాలు (రక్షణ శాఖ సంబంధ భూములు )6. కేటాయింపు కేసులు (కంచన్‌బాగ్ )సమస్యలపై విపులంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రక్షణ, రెవెన్యూ, భూవివాదాలు, సరిహద్దు సమస్యలను డిఫెన్స్, రెవెన్యూ సర్వేశాఖలు ఒక తేదీ నిర్ణయించి ఉమ్మడి సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో బ్రిగేడియర్ సోమశంకర్, ఎస్.ఎం, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, హైదరాబాద్ , సికింద్రాబాద్ ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, రక్షణ, రెవెన్యూశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్‌లో ఈటల ఆత్మీయ సమ్మేళనం

**నిజాంపేట్, జూన్ 22, ప్రభాతవార్త :** నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ప్రగతి నగర్ నందు పుచ్చలపల్లి లీల సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంటరీ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ అఖండ మెజార్టీతో గెలవడమే కాకుండా నిజాంపేటలో భారీ మెజార్టీ 17000 పైచిలుకు రావడంతో బీజేపీ కార్యకర్తలు నాయకులు ఈటెల రాజేందర్‌కు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ మెజార్టీ ఇచ్చిన నిజాంపేట్ కార్పొరేషన్ పౌరులు ఎదుర్కొంటున్న 16 సమస్యల పరిష్కారం చేయవలసిందిగా ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం అందించారు. ఆనంతరం ఈటెల రాజజేందర్‌ను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ మెజార్టీ ఇచ్చిన నిజాంపేట్ కార్పొరేషన్ సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు ఎల్లవేళలా ముందు ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, శేఖర్‌యాదవ్, రాజు, నాగరాజు, చంద్రమౌళి, అమలేశ్వరి, విజయలక్ష్మీ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై వీధికుక్కల మూకుమ్మడి దాడి ..

**-ప్రతిఘటించడంతో ప్రాణాలతో భయటపడ్డ మహిళ**
**-మణికొండ చిత్రపురి కాలనీలో ఘటన**

**హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త:**
రంగారెడ్డిజిల్లాలో వెన్నులో దడపుట్టించే ఘటన చోటుచేసుకుంది. ఓమహిళలపై వీదికుక్కలు మూకుమ్మడిగా దాడికి యత్నించాయి. సదరు మహిళ ప్రతిఘటించడంతో ప్రాణాలతో భయటపడింది. ఈఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తుంది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో కారు పార్కింగ్ వద్ద స్కూటీపై వచ్చిన ఓమహిళలపై ఒకటికాదు రెండు కాదు ఏకంగా 15కుక్కలు దాడిచేశాయి. కుక్కలను వెళ్లగొట్టేందుకు బాధిత మహిళ ఎంతో ప్రయత్నం చేసింది. మరింతగా రెచ్చిపోయి ..పైపైకి వచ్చిదాడి చేసేందుకు వీధికుక్కలు ప్రయత్నించాయి. దాదాపు అరగంటపాటు వీధి కుక్కలతో పోరాడి ప్రాణాలు దక్కించుకుంది. దీనికి సంబంధించిన విజువల్స్ సిసికెమెరాల్లో రికార్డు అయ్యాయి. దీంతో కాలనీవాసులు వీధికుక్కల బారినుంచి కాపాడాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంతో ఇదే ప్రాంతంలో తల్లికొడుకులపై విచక్షణా రహితంగా దాడిచేసనిట్లు తెలిపారు.

## బాలుడిని కిడ్నాప్ చేసిన నిందితుడి అరెస్టు..



పోలీసులు రక్షించిన కిడా ్నప్‌కు గురయిన బాలుడు

**సరూర్‌నగర్, జూన్ 22 ప్రభాతవార్త:**
బాలుడిని కిడ్నాప్ చేసిన వ్యక్తిని పహడీషరీఫ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జల్‌పల్లి శ్రీరామకాలనీలో నివసిస్తున్న అర్జున్ అనే వ్యక్తి సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో బంధువుల అబ్బాయిని కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు శ్రీరామ కాలనీలోనే నివాసం ఉంటున్న ఏదుల తిరుపతమ్మ కుమారుడు సాయి (6)ను కిడ్నాప్ చేశాడు. అయితే బాలుడు కిడ్నాప్‌కు గురయినట్లు గ్రహించిన తిరుపతమ్మ పహడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రంగంలో దిగిన పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలించారు. ఈ నేపథ్యంలో జల్‌పల్లి పార్థివాడ సమీపంలో చెట్ల పొదల వద్ద బాలుడు ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు బాలుడిని కిడా ్న పర్ నుండి రక్షించి నిందితుడిని అరెస్టు చేశారు. ఆ తర్వాత బాలుడిని క్షేమంగా తల్లికి అప్పగించారు. నిందితునిపై కేసును నమోదు చేసి పోలీసులు రిమాండ్‌కు పంపారు.

## లారీ డ్రైవర్ హత్య

**చార్మినార్,జూన్ 22 ప్రభాతవార్త :**
వివాహం జరిగిన ఓ మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న ఓ లారీ డ్రైవర్ దారుణ హత్యకు గురైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి పాతబస్తీ ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఏసిపి బి.వై.స్వామి కథనం ప్రకారం...హాసన్‌నగర్ ప్రాంతానికి చెందిన జాకీర్ అలీ (29) ఓ ప్రైవేట్ ఆయిల్ ట్రాన్స్‌ఫోర్టులో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.కాగా జాకీర్ అలీ గత ఐదు సంవత్సరాలు నుంచి ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలోని అచ్చిరెడ్డినగర్‌కు చెందిన 40 సంవత్సరాలు వయస్సుగల వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకుని ఆ మహిళను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడు.మహిళ తనను వదిలి పెట్టమని పలు మార్లు చెప్పిన జాకీర్ అలీ పట్టించు కోకుండ పలు విధాలుగా వేధిస్తున్నాడు.ఈ విషయాన్ని వివాహిత తన సోదరుడైన షఫీకి తెలిపింది.కాగా షఫీ పలు మార్లు జాకీర్ అలీని హెచ్చరించిన ఫలితం లేకపోయింది.లారీ డ్రైవర్ జాకీర్ అలీ ఈ నెల 21వ తేదీ శుక్రవారం అర్ధరాత్రి అచ్చిరెడ్డి నగర్‌లోని వివాహిత ఇంటికి వచ్చాడు. ఈ విషయాన్ని ఆ మహిళ తన సోదరుడైన షఫీకి తెలిపింది.షఫీ వెంటనే అక్కడకు చేరుకున్నాడు.జాకీర్ అలీ షఫీలమధ్య గొడవ జరిగింది.కోపంలో షఫీ జాకీర్ తలపై ఇనుప రాడ్డు,గడ్డ పారాపై కొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు.తలకు బలమైన గాయాలు కావటంతో సంఘటన స్థలంలోనే లారీ డ్రైవర్ జాకీర్ అలీ మృతి చెందాడు.జాకీర్ అలీ మృత దేహానికి పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులు అప్పగించారు.జాకీర్ అలీ హత్య కేసులో వివాహితతో పాటు భర్త హాజీ,ఆమె సోదరుడు ఉన్నట్లు సమాచారం. ఈ కేసును ఫలక్‌నుమా పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మత్తు పదార్థాలు సేవిస్తే కఠిన చర్యలు..

**జగద్గిరిగుట్ట, జూన్ 22, ప్రభాతవార్త :** సిపి సైబరాబాద్ ఆదేశాల మేరకు శనివారం స్పెషల్ కండక్టింగ్ జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఎల్లమ్మబండ చెరువుకట్ట, జగద్గిరిగుట్ట బస్‌స్టాప్, ఆస్బెస్టాస్ కాలనీ పార్క్ ప్రాంతం, గుబురుగుట్ట, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిమితుల సిక్కు బస్తీలలో పబ్లిక్ ప్రాంతాలలో డ్రైవ్ చేయగా బయట కొంతమంది యువకులు మద్యం సేవిస్తుండగా వారిని పట్టుకుని కౌన్సిలింగ్ కోసం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇకపై బహిరంగ ప్రదేశాల్లో మత్తు పదార్థాలు సేకరిస్తున్నట్టు సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



తడిపొడి చెత్త నిర్వహణపై పోచారం మున్సిపల్ ప్రజాప్రతినిధుల బృందం ఇన్ఫోసిస్ క్యాంపస్‌ను సందర్శించిన దృశ్యం

## ఇన్ఫోసిస్ క్యాంపస్‌ను సందర్శించిన పోచారం మున్సిపల్ ప్రజాప్రతినిధుల బృందం

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 22, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ కౌన్సిలర్లు తడి పొడి చెత్తల నిర్వహణపై ఇన్ఫోసిస్ క్యాంపస్‌ను శనివారం సందర్శించినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో తడి పొడి చెత్త ద్వారా గ్యాస్ తయారీ, ఎరువుల తయారీచేసి మొక్కల పెంపకానికి ఉపయోగించడం వంటి అంశాలను పరిశీలించడం జరిగిందని చైర్మన్ బి. కొండల్ రెడ్డి తెలిపారు. ఎస్‌టీపీల ద్వారా మురుగునీరును శుద్ధిచేసి చెట్లకు ఆనీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. తడి చెత్తతో గ్యాస్ తయారీ మొదలగు వాటిని పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఇన్ఫోసిస్ కంపెనీలో చెత్త నిర్వహణపై అవలంభిస్తున్న విధానాలను మున్సిపల్‌లో ఏర్పాటు చేస్తామని చైర్మన్ తెలిపారు. చైర్మన్ బి. కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ క్యాంపెస్‌ను సందర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కమిషనర్ పి. వేమన రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేశ్ కురుమ, నర్రీ ధనలక్ష్మికాశయ్య, చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, ఆకిటి శైలజ, మెట్టు బాల్‌రెడ్డి, బాలగోని వెంకటేశ్ గౌడ్, నల్లవెల్లి లక్ష్మీశేఖర్ ముదిరాజ్, సుర్వీ రవీందర్, సామల శ్రీలత, ఎం. పోచమ్మ, ఎస్. సుధాలక్ష్మి, బద్దం మమత, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అక్రం అలీ, దాసరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## యాదారంలో జరిగిన ఉచిత మెగా ఆరోగ్యశిబిరం



యాదారం గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 22, ప్రభాతవార్త** యాదారం గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం జరిగింది. శనివారం శామీర్‌పేట మండలం లోని యాదారం గ్రామంలో ఉచిత ఆరోగ్య శిభిరం జరిగింది. దీనిలో బిపి,షుగర్, కంటి పరీక్షలతో పాటు చెవి.ముక్కు,గొంతు, పలు రకాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 112మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు వీరిలో 34మందికి వివిధ రకాల ఆపరేషన్ల నిమిత్తం మెడిసిటీ హాస్పిటల్‌కు రెఫర్‌చేయటం జరిగిందని వైద్యులు, నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగ మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రమీలాదేవి, వైద్యులు అంకుష్, అనూష, సహజ, నిఖిత, వర్షా, వినయ్, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, శేఖర్‌బాబు, రాఖేశ్, శిరీష, అభిషేక్‌లు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామాలకు పట్టుకొమ్మలు



అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్

**షాబాద్, జూన్ 22, ప్రభాతవార్త** : అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామాలకు పట్టుకొమ్మ లు అని అంగన్‌వాడీ టీచర్ వినోద అన్నారు. శనివారం మండల పరిధిలోని వెంకమ్మగూడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచి విద్యతో పాటు, మంచి పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులను అంగన్‌వాడీలలో చేర్పించి చక్కటి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్

**వికారాబాద్,జూన్ 22, ప్రభాతవార్త:** నూతనంగా జిల్లా ఎస్పీ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ కె.నారాయణరెడ్డి ని పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.అశోక్, సంఘం సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం సభ్యుల సాదక బాధలు సైతం ఎస్పీ కి విన్నవించుకున్నారు. ఈ విషయమై ఎస్పీ సానుకూలంగా స్పందించడంతో సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సిములు, ఆనంద్, సంజీవయ్య, నారాయణమ్మ, వీరన్న, అలీమోద్దీన్, ఫయాజ్ అలీ తదితరులు ఉన్నారు.

## ఏఈ శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం..వీడ్కోలు

**ఘట్‌కేసర్, జూన్ 22, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయం ఎంపిపి చాంబర్‌లో శనివారం బదిలీపై వెళ్తున్న ఆర్అండ్‌బి ఏఈ శ్రీనివాస్‌రెడ్డిని ఎంపిపి సుదర్శన్‌రెడ్డి సన్మానించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి మండలంలో రోడ్ల అభివృద్ధికి, నిధుల మంజూరు కృషి చేశారని తెలిపారు. ఘట్‌కేసర్ ఆర్‌ఓబీ, నారపల్లి-ఎదులాబాద్ రోడ్డు ఇతర రోడ్ల పనులకు అవసరమైన ప్రతిపాదనలు చేసి నిధుల మంజూరుకు, రోడ్ల సమస్యల పరిష్కారం చేయడంలో సహకరించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమం లో ఎంపిటిసి సభ్యులు గట్టగళ్ల రవి, పులకంటి భాస్కర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు మంచాల సుధాకర్, చుక్కల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



ఏఈ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

# ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



కాడెద్దులతో రైతు మహేష్

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 22,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి పండుగను ఘనంగ జరుపుకున్నారు. గ్రామాల్లోని దేవాలయాల చుట్టు తమ వాహనాలు, శఖోత్సవాలలో ప్రదక్షణలు చేశారు. తమ గ్రామ ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని దేవుళ్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### పూడూరు మండలంలో..

**పూడూరు, జూన్ 22, ప్రభాతవార్త ;** పూడూరు మండలం పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఏరవాక పౌర్ణమి పండుగ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు.ప్రతి సంవత్సరం వచ్చే తొలకరివర్షాల తొలినాళ్లలో వచ్చే ఏరువాక పౌర్ణమికి గ్రామాల్లో ఈ సందడి నెలకొనడం ఆనవాయితీగా వస్తోంది.కాగా శుక్ర,శని వారాల్లో మండలంలోని కద్మూరు, పూడూరు,కంకల్,సోమన్‌గుర్తి,మంచన్‌పల్లి,పెద్ద ఉమ్మెంతాల్, ఎన్కెపల్లి, రాకంచెర్ల, చెన్‌గోముల్,మిట్టకంకల్,అంగడి చిట్టంపల్లి,నిజాంపేట్ మేడిపల్లి, తుర్కఎన్కెపల్లి, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో రైతులు ఉదయాన్నేలేచి తమ ఇళ్లనుశుభ్ర పరుచుకొని,స్నానాలు ఆచరించి,వివిధ రాకాల (బక్షాలు) పిండివంటలను తయారుచేసి,ఎద్దులను శుభ్ర పరిచి పలు రకాలరంగులతో ఎడ్లను,ఎద్దులబండ్లను అలంకరించారు.ఆయా గ్రామాల్లో వెలసిన ఆలయాలచుట్టూ రైతులు ఎడ్లబండ్లతో పోటాపోటీన ప్రదక్షిణలు చేయించి ప్రత్యేక పూజలు నిర్విహించారు.ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు భారీసంఖ్యలో ఆలయాలవద్దకు చేరుకొని పోటీతోవెళ్లే ఎడ్లబండ్ల ప్రదక్షిణ కార్యక్రమాలను ఆసక్తితో తిలకించారు. అనంతరంపిండివంటలతో తయారు చేసిన (పుల్లం)భక్షాలను పశువులకు పెట్టారు.



ఏరువాక పౌర్ణమి పండుగ జరుపుకుంటున్న ప్రజలు

### షాబాద్‌లో..

**షాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలకు కష్టకాలం అధిగమించి, కరువులబారి నుండి సుబిక్షంగా ఉండాలని జ్యేష్టమాస శుద్ద పౌర్ణమి శనివారం షాబాద్ మండలంలోని రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాడెద్దులను రంగులతో అలంకరిం చారు. అనంతరం పొలంలో రైతులు, మహిళలు నాగళ్లు, గుంటకలతో భూమిని చదును చేస్తు విత్తనాలు నాటారు.

### బొంరాస్‌పేట్‌లో..

బొంరాస్‌పేట్,జూన్22,ప్రభాతవార్త : పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ బొంరాస్‌పేట్,దుద్యాల్ మండలల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి పం డుగను ఘనంగా నిర్వహించారు.ఉదయం పశువులను నీటితో కడిగి వాటిని ప్రత్యేక రంగురంగులతో అందంగా వాటిని అలంకరించారు.సాయంత్రం సమయం లో ఎడ్లబండ్లను గ్రామాల్లోని వీధులగండా ఊరేగిం పుగా బయలుదేరి దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, యువకులు పాల్గోన్నారు.



సంఘటన స్థలం వద్ద శవాన్ని తీస్తున్న పోలీసులు

## అక్రమ సంబంధంతోనే మహిళ హత్య

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**షాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** అదృశ్యమైన మహిళ హత్యకు గురైన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శనివారం ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.... షాబాద్ మండల కేంద్రంలోని తొంట సంతోష(30) ఫరూఖ్‌నగర్ మండల హాజిపల్లి గ్రామానికి చెందిన సదుల సత్తయ్యతో గత రెండు సంవత్సరాల నుండి అక్రమ సంబందం కొనసాగుతుంది. మండల పరిధిలోని బోనగిరిపల్లి స్టేజి వద్ద కొలబరేట్ వెంచర్‌లో గత ఫిబ్రవరి నుండి వాచ్‌మెన్‌గా సత్తయ్య విధులు నిర్వహిస్తున్నాడు. ఈ వెంచర్‌లో గత ఫిబ్రవరి నుండి వాచ్‌మెన్‌గా సత్తయ్య విధులు నిర్వహిస్తున్నాడు. ఈ వెంచర్‌లోనే ఇద్దరు తరుచూ కలుసుకునేవారు. సంతోష మరోకరితో సన్నిహితంగా ఉంటుందనే అనుమానంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఇదే క్రమంలో ఏప్రిల్ 7న వెంచర్‌కు వచ్చిన సంతోషతో గొడవపడి మాట మాట పెరిగి కర్రతో ఆమెపై దాడి చేశాడు. దాడిలో తలతో పాటు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలై పడిపోయింది. వెంటనే ఆమెను పక్కనే ఉన్న వాగులో గుంత తీసి పూడ్చిపెట్టాడు. అప్పటి నుండి సంతోష ఇంటికి రాకపోవడంతో కుమారుడు సంతోష్ షాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. షాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తు పోన్ కాల్ డేటా పరిశీలించగా సత్తయ్య ఆమెతో ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడినట్లు కాల్ వివరాలు రావడంతో పోలీసులు అతనిపై నిఘా పెట్టారు. హత్య జరిగిన రోజు నుండి సత్తయ్య వాచ్‌మెన్ పని నిర్వహించకుండా పరారయ్యాడు. ఈనెల 21న తాను హత్య చేసిన ప్రాంతాన్ని గమనించేందుకు వచ్చిన సత్తయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా సంతోష హత్య వివరాలు వెల్లడించారు. సంఘటన స్థలానినన అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్, ఫోరెన్స్ అధికారులు, తహసీల్దార్ అన్వర్ సమక్షంలో సంఘటన స్థలంలోనే శవానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతురాలు కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వం వెంటనే విద్యావలంటీర్ల నియామకం చేయాలి

### -పెండింగ్ కరువు భత్యంను విడుదలచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

**బొంరాస్‌పేట్,జూన్22,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాఉలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఉపాధ్యాయ జేఏసీ నాయకులు బాకారం చంద్రశేఖర్, అనిల్‌కుమార్,గౌరారం గోపాల్ అన్నారు.మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటుచేసిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడుతూ జూన్ 12వ తేది నుండి ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభించిన నేపథ్యంలో విద్యార్థులకు సరిపడినంత ఉపాధ్యాయులు లేనందున విద్యావాలంటీర్లనుత్వరగా నియామించాలన్నారు. పాఠశాలల పరిశుధ్య పనుల నిర్వహణకు సర్వీస్ పర్సన్స్‌ను వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే దీర్ఘకాలంగా బిల్స్ సరెండర్‌లీవ్స్,మెడికల్ బిల్స్,జిపిఎఫ్ రుణాలు,పార్టు ఫైనల్స్ బిల్లులను ప్రభుత్వం ఆర్థికశాఖ ద్వార వెంటనే విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యా జేఏసీ నాయకులు కాశీపతి,శ్రీహరి తదితరులు పాల్గోన్నారు.

## ఇంటి డాక్యుమెంట్ ఆచూకీ తెలిస్తే అందించండి

**పరిగి,జూన్22,ప్రభాతవార్త :** తప్పిపోయిన తన ఇంటి స్థలం డాక్యుమెంట్ ఆచూకీ తెలిస్తే దయచేసి తనకు అందించాలని కుల్కచర్ల మండల పరిధిలోని తిర్మలపూర్ గ్రామానికి చెందిన సీ రవీందర్ తండ్రి తిరుపతయ్య(41) విజ్ఞప్తి చేశారు.పరిగి పట్టణంలోని జైభవాని నగర్‌లో 2021వ సంవత్సరంలో ఒక ప్లాట్‌ని కొనుగోలు చేయడం జరిగింది.అట్టి నా యొక్క ప్లాట్‌కు కొనుగోలు సమయంలో రెండు లింక్ డాక్యుమెంట్స్ ఇవ్వడం జరిగిందన్నారు.అందులో మొదటి డాక్యుమెంట్ నంబర్ 2547':2017,రెండవ డాక్యుమెంట్ నంబర్ 1351:2016లు ఉన్నాయి.తేది 25.05.2024న పరిగి నుండి కుల్కచర్లకు వెళ్ళడానికి పరిగి బస్సుస్టాండ్‌కు వెళ్ళగా అక్కడ నా యొక్క బ్యాగుమీస్ కావడం జరిగింది.బ్యాగులో ఇంటి స్థలంకు సంబంధించిన టింక్ డాక్యుమెంట్స్ నంబర్ 1351:2016 ఉంది.కావున నా యొక్క ఇంటి స్థలంకు సంబంధించిన డాక్యుమెంట్ ఎవ్వరికైన దొరికితే మొబైల్ నంబర్ 9398836192, 8712543600 నంబర్లను ఫోన్ ద్వార సంప్రదించి ఇవ్వగలరని అయన కోరారు



సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

## సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి కృషి: చైర్‌పర్సన్

**ఘట్‌కేసర్, జూన్ 22, ప్రభాతవార్త:** సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి తన వంతు సహకారం ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ముళ్ళి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ గురుకుల్ కళాశాల ప్రాంగణంలో శనివారం ఘట్‌కేసర్ మండల సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు రంగయ్య అధ్యక్షతన జరిగిన 'సీనియర్ సిటిజన్ మీట్'లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు చైర్‌పర్సన్ చేతుల మీదుగా గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అసోసియేషన్ సమావేశాలు నిర్వహించుకోవడానికి భవనం నిర్మాణం చేయడానికి మున్సిపల్ పరిధిలో స్థలం కేటాయించాలని సీనియర్లు చైర్‌పర్సన్‌కు విజ్ఞప్తి చేశారు. 60 సంవత్సరాలు కల్గిన వారు ఐడికార్డుల కోసం ధరఖాస్తు చేసుకోవచ్చని అధ్యక్షులు కోరారు. సీనియర్ సిటిజన్లకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు సహకరించాలని రంగయ్య పేర్కొన్నారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ దంపతులను శాలువా, పూలదండలతో నిర్వహకులు సన్మానించారు. ఈసమావేశంలో కౌన్సిలర్ బర్ల శశికళ దేవేందర్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు వెంకట్‌రాంరెడ్డి, గురుకుల్ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, అసోసియేషన్ మండల కార్యదర్శి మల్లారెడ్డి, సభ్యులు బచ్చు మారయ్యగుప్త, సోమయ్య, నివృత్తి పండిత్‌జీ, అభిమన్యుఝా, బి.ప్రభాకర్, కృష్ణ, ఎల్లయ్య, నాయకులు మారం లక్ష్మారెడ్డి, బర్ల రాధాకృష్ణ, విక్రాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్‌తో సామాజిక సేవలు: విసి అర్చన




ఏయూలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపకులపతి అర్చన

**ఘట్‌కేసర్, జూన్ 22, ప్రభాతవార్త:** జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థులు సామాజిక సేవా దృక్పథం ఏర్పరచుకోవాలని ఏయూ ఉపకులపతి డాక్టర్ అర్చన మంత్రి అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనం గా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఎన్‌సీసీ యూనిట్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో 450 మంది వాటీ ంటర్లు, విద్యార్థులు, అధ్యాపకులకు యోగా శిక్షణ ఇచ్చారు. యోగా అసనాలను సాధన చేయించి యోగా ప్రాముఖ్యను వివరించారు. ఈసందర్భంగా ఏయూ వైస్‌చాన్సలర్ డాక్టర్ అర్చన మంత్రి మాట్లాడుతూ యోగాతో ముడిపడి ఉన్న తన జీవిత కథను పంచుకున్నారు. దీర్ఘాయువు జీవించడానికి మానసిక, శారీరక ఆరోగ్యం, ఆధ్యాత్మిక ఆరోగ్యం వంటి విషయాలను తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ దా ్వరా గ్రామాల ప్రజలకు సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డీన్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ సెల్ ఎన్‌సీసీ సీటీఓ డాక్టర్ చెన్నకేశ్ మల్లేశ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ టిఎస్ అండ్ ఏపీ రాష్ట్ర డైరక్టర్ విజయరావు, యూత్ అధికారి ఈసయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు పురుషోత్తం, కిరణ్‌కుమార్, శిక్షకులు నవీన్, మమత, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించి గుర్తింపు పొందాలి

**ఘట్‌కేసర్, జూన్ 22, ప్రభాతవార్త:** గ్రామాల్లో యువకులు సమయం వృదా చేసుకోకుండా క్రీడల్లో రాణించాలని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం మర్రిపల్లిగూడలో ఎంపీఎల్-4 టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. యువక్రీడాకారులు క్రీడల్లో రాణించడం ద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. గెలుపు, ఓటమిలతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి ఆడాలని ఎంపీఎల్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాయ నరేశ్, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాత్రి వెంకటేశ్, మాజీ వార్డుసభ్యులు, నాయకులు, నిర్వహకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారుల పాలనలో అభివృద్ధి శూన్యం

**యాచారం జూన్22,ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆడింది ఆట పాడింది పాట ప్రజాప్రతినిధులు పాలన ముగిసిన అనంతరం ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.గ్రామాలలో ప్రజాప్రతినిధులు లేక అభివృద్ధి జరగక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్న చందనం పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు.ప్రత్యేక అధికారుల గ్రామాల వంక కన్నెత్తి చూడడం లేదని నామాత్రంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.గ్రామపంచాయతీ గ్రామ సెక్రటరీ అస్సలు బాగోలేదని వారు ఆడిందే ఆట పాడిందే పాట కృష్ణారాజ్యం వివరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.పంచాయతీ బిల్లులు డ్రా చేయడంలో ఇలాంటి సూపర్‌వైజర్ లేకుండా నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయి.పట్టించుకునే నాథుడే కరవైయాడని క్షేత్రస్థాయి సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేదని తెలుస్తుందని

## నేడు విద్యుత్ అంతరాయం

**యాచారం జూన్22,ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతుల కారణంగా యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఆదివారం ఉదయం నుండి విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏఈ సందీప్ కుమార్ పేర్కొన్నారు.11 కె.వి నందివనపర్తి ఫీడర్,11 కెవి నానక్ నగర్,11 కెవి నందివనపర్తి ఇండస్ట్రియల్,11 కెవి మేడిపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్ విద్యుత్ మరమ్మతులు,విద్యుత్ తీగలకు తగిలే చెట్టు కొమ్మలను తొలగించు కార్యక్రమం ఉండటం వలన ఉదయం 9 గంటల నుండి 5వరకు నందివనపర్తి గ్రామం,బొల్లి గుట్ట తండా,రైతులకు,నానక్‌నగర్ గ్రామం,రైతులకు మరియు 2 గంటల నుండి 6 గంటల వరకు మేడిపల్లి ఇండస్ట్రీస్ నజ్దిక్ సింగారం,విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతున్నద కాబట్టి విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ఆదిభట్ల జూన్22,ప్రభాతవార్త :** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభించింది.ఆదిభట్ల సిఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బొంగులూరు నుంచి కోహెడ మధ్యలో గల ఔటర్ రింగ్ రోడ్డు ఫారెస్ట్ ఏరియాలో మృతదేహం లభ్యమైనట్టు తెలిపారు.ఈ మృతదేహం 50 సంవత్సరాలు గల పురుషుడి మృతదేహంగా గుర్తించారు.తెలుపు రంగు చొక్కా వేసుకున్న వ్యక్తి దాదాపు రెండు నెలల క్రితం చనిపోయినట్టుగా గుర్తించారు.మృతుడి వివరాల కోసం పోలిసులు గాలింపులు చేపట్టారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నీట్ లీకేజీపై సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలి

### మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి అమేర్

**కేశంపేట ,జూన్ 22, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్ పరీక్ష లీకేజీపై తక్షణమే నరేంద్ర మోడీ ప్రభుత్వం స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేశంపేట మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి అమేర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆయన అన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల పరీక్షలతో చెలగాటం ఆడటం సరైన పద్దతి కాదన్నారు. బిజెపి అధికారంలో ఉన్న టువంటి రాష్ట్రాల్లోనే ఎందుకు పేపర్ లీకేజీలు అవుతున్నాయని ఆయన ప్రభుత్వా న్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా పరీక్ష కాన్న ముందు పేపర్ల లీకేజీ అవుతుంటే ఆట బొమ్మలాడుతున్నట్లుగా వ్యవహరించే తీరు సరైన పద్దతి కాదని దేశంలో మోడీప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసి మాయల పకీరు మాటలు చెప్పుతూ పూట గడపాలని చూస్తూ ఉండడం సరికాదన్నారు. ఇప్పటికైనా నీట్‌పరీక్షను రద్దుచేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## మహేష్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కేశంపేట ,జూన్ 22, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని వేముల నర్సగ్రామానికి చెందిన చిర్ర మహేష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో మెరుగైన వైద్యం చేయించేందుకు మహేష్‌ను షాద్‌నగర్‌లో బుగ్గారెడ్డి ఆసుపత్రికి తరలించారు. విషయాన్ని కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేశం విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకె ళ్లారు. ఎమ్మెల్యే శంకర్ శనివారం హాస్పిటల్లో ఉన్న చిర్రా మహేష్‌ను పరామర్శించి ఆసుపత్రి సిబ్బందిని పిలిపించి ఇతనికి మంచి వైద్యం అందివ్వాల్సిందిగా డాక్టర్లను హాస్పిటల్ సిబ్బందిని ఆదేశించారు.చికిత్స పొందుతున్న మహేష్‌కి ఖర్చుల నిమిత్తం 5000 రూపాయలను అందజేశారు. కేశంపేట మండల జెడ్పిటిసి విశాల శ్రావణ్‌రెడ్డి మహేష్‌ను పరామర్శించి అతని కుటుంబ సభ్యులకు 5000 రూపాయల సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల గోపాల్ ముదిరాజ్ మనోహర్‌గౌడ్ శ్యామలమ్మ ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ నిర్ణయం చారిత్రాత్మకం

### రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్ టౌన్, జూన్ 22, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్ మున్సిపల్ సమీక్షా సమావేశం అనంతరం అయన విలేకరులతో మాట్లాడారు. రోడ్లు, తాగునీరు,మురికి కాల్వల నిర్మాణం, ఎల్లమ్మ చెరువు లాంటి వాటిని ప్రధాన్యగా తీసుకుంటామన్నారు. మున్సిపల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నార.తడి,పొడి చెత్తను వేర్వేగా చేసిగా మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. దోమలు అభివృద్ధి చెందకుడా మురికి నీరు నిల్వ ఉ ండకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పట్టణంలో ఎక్కడ అటంకం లేకుండా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నార. హుస్నాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేయాలని ఉంది సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తానని తెలిపారు.రాష్ట్ర కేబినెట్‌లో చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం జరిగిందని అందులో నేను భాగస్వామిని కావడం రైతు బిడ్డగా సంతోషంగా ఉందన్నా రు. రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో భాగంగా రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేయడానికి రాష్ట్ర కేబినేట్ తీర్మాణం చేసిందన్నారు. విధివిధానాలు త్వరలోనే వస్తా యన్నారు. దశల వారీగా కాకుండా ఒకేసారి రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అయన రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ అకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ అనిత శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

### నాటుసార స్థావరాలపై విస్తృత దాడులు

**తలకొండపల్లి ,జూన్ 22, ప్రభాతవార్త :** ఆమనగల్లు తలకొండపల్లి మాడుగుల కడ్తాల్‌లలో శనివారం దశరథ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశానుసారం ఉజ్వల రెడ్డి సరూర్‌నగర్ అదేశానుసారం నాలుగు టీంటైంలో శనివారం ఉదయం తలకొం డపల్లి లోని తుమ్మల కుంట తండా హర్యానాక తండా లక్ష్మీతండా చీపునుంతల చుక్కాపూర్ విలేజీలలో నాటు సార స్థావరాలపై విస్తృత దాడులు చేయడం జరిగింది. కేసులు నమోదు చేయడం జరిగింది.

**PUBLIC NOTICE**

The general public are informed that my client Mr. Linga Rohit Kumar S/o. L. Hari Kumar, Aged 37 yrs. Occ: Business, R/o. Plot No. 49, Road No.4, Balaji Nagar Colony, Mohan Nagar, Kothapet, Saroornagar, R.R. Dist. T.S. is intending to purchase Schedule A and B properties from the owners and posessors and entered into agreement of sale with Smt. Gudupally Lalitha W/o. Gudupally Prasnth Aged about 51 yrs. Occ: House wife, R/o. H.No. 3-56, Satwar (V), Zaheerabad (M), Sanga Reddy Dist. T.S. owner of schedule A property and Mr. Vadla Srikanth S/o. Vadla Badranna Aged about 34 yrs. Occ: Agriculture, R/o. H.No. 2-75, owner of Schedule B Property and paid substantial amounts to both of them as taken advance and part sale consideration. Both the schedules A and B are bounded by boundaries as noted below:

**SCHEDULE A**

Agricultural land Sy.No. 228/E1, admeasuring 0.19 Gts. situated at Satwar (V), Zaheerabad (M), Sanga Reddy Dist. T.S. bounded by: North: Agricultural land of Vendee Linga Rohit Kumar, South: Agricultural land of Chakali Bichamma, East: Agricultural land of Chakali Prabhu, West: Agricultural land of Vadla Srikanth.

**SCHEDULE B**

Agricultural land Sy. No. 228/E1 admeasuring 0-19 Gts. situated at Satwar (V), Zaheerabad (M), Sanga Reddy Dist. T.S bounded by: North: Agricultural land of Vendee Linga Rohit Kumar, South: Agricultural land ofChakali Bichamma, East: Agricultural land of Gudupally Lalitha, West: Road.

If any person / s are having any right , title and interest over both A and B schedule of property may approach the under signed within 10 days from the date of publication of this notice with documentary evidence, failing which my client with proceed further for registration of sale of deeds of both A and B schedule of properties. Later, no claims shall have entertained and such claims shall be treated waived off.

Sd/- **Pannala Mohan Reddy,** Advocate
H.No.2-103, Kuntloor (Via), Hayathnagar, R.R. Dist – 501505. Ph: 9849669252
Place: Dilsukhnagar, Date: 07-05-2024

# వంతెన నిర్మాణ పనులు ప్రారంభం

(వార్త ప్రభావం)



కిషన్ నాయక్ తండా వాగుపై కొనసాగుతున్న వంతెన పనులు

**సిర్గాపూర్, జూన్ 22, ప్రభాతవార్త:** ఆగిన వంతెన నిర్మాణం పనులు-అవస్థలు పడుతున్న ప్రజలు, పట్టించుకోని అధికారులు, పాలకులు శీర్షికతో ఈ నెల 7వ తారీఖున ప్రచురితమైన వార్త కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిధిలోని కిషన్ నాయక్ తండా వాగుపై నిర్మాణం పనులు అర్థాంతంగా ఆగిపోవడంతో ప్రజలు పడుతున్న పాట్లను ప్రభాతవార్త సమస్యను వెలుగులోకి తెచ్చిన విషయం పాఠకులకు విధితమే. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పనులను తిరిగి శక్రవారం ప్రారంభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు మండలంలో విద్యుత్ అంతరాయం

**అల్లాదుర్గం, జూన్ 22, ప్రభాతవార్త:** అల్లాదుర్గం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 5 గ్రామాలకు ఈ నెల 23వ తారీఖున విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శివాజీ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని అల్లాదుర్గం, చిల్వర్, మాందాపూర్, ముప్పారం గ్రామాలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా కాదని, అందుకు వినియోగదారులు ముందస్తుగా తమ పనులు పూర్తి చేసుకోవాలన్నారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు తమ వంతు సహకరించాలని ఏఈ శివాజీ సూచించారు.

## మండల పరిషత్‌ను సిఇఒ తనిఖీ



మండల పరిషత్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ ఎల్లయ్య

**అల్లాదుర్గం, జూన్ 22, ప్రభాతవార్త:** మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం జిల్లా ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ) ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాయలంలోని రికార్డులను ఎల్లయ్య పరిశీలించారు. ప్రజా పాలన సేవా కేంద్రంలో జీరో కరెంటు బిల్లు, గ్యాస్ కలెక్షన్ వెరిఫికేషన్ చేసుకోవచ్చని సీఈఓ ఎల్లయ్య తెలిపారు. సీఈఓ వెంట ఉప ముఖ్య కార్యనిర్వాహణ అధికారి రంగాచారి, ఎంపిడిఓ కే శంకర్, జూనియర్ సహాయకులు సజ్జాత్ అలీ, కంప్యూటర్ ఆపరేటర్లు లక్ష్మణ్,నరేందర్‌లు ఉన్నారు.

## దత్తగిరి ఆశ్రమానికి భూమి విరాళం

**-అభినందనలు అందుకున్న దాత నాగమణి**

**మనూర్, జూన్ 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్ గ్రామానికి చెందిన నాగమణి దత్తగిరి ఆశ్రమానికి తనకు చెందిన రెండు ప్లాట్లను విరాళంగా శనివారం అందచేశారు. గ్రామంలోని పాండురంగ మందిరం పక్కన నాగమణికి రెండు ప్లాట్లు ఉండగా వాటిని ఆశ్రమానికి అందిస్తూ శనివారం ప్లాట్లకు సంబంధించిన పత్రాలను ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్ (అప్పగారు)కి గ్రామస్థుల సమక్షంలో అందించారు. నాగమణి ఆశ్రమానికి భూమిని కేటాయించడం పట్ల ఆశ్రమ పీఠాధిపతి, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ఉ అంజయ్య, సాయిలు, మోహన్‌రెడ్డి, పాండురంగం, అశోక్‌కుమార్, దత్తు, నర్సింలు, నగేష్, గడిల విఠల్, శంకర్, రామచంర్, నర్సిగొండ, ధర్మారెడ్డి తదితరులు ఉన్నారు.

## నర్సాపూర్ పురపాలక సంఘం సమీక్షా సమావేశం



నర్సాపూర్ పురపాలక సంఘం కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశం లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అశోక్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్ జూన్ 22. ప్రభాతవార్త :** నర్సాపూర్ పురపాలక సంఘం కార్యాలయంలో పురపాలిక చైర్ పర్సన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అధ్వర్యంలో పురపాలక సంఘం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ. సమావేశంలో పురపాలిక చైర్ పర్సన్‌అశోక్‌గౌడ్ సమక్షంలో పురపాలిక అధికారులు, సిబ్బంది తో సమీక్షా నిర్వహించారు. సందర్భంగా ఈ సమావేశంలో వర్షాకాలంలో తీసుకోవల్సి నజాగ్రత్తలు, సనరనకమంగా వీధిదీపాల నిర్వహణ,మురికి కాలువలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్వహణ, మురికి నీరు, వర్షపు నీరు తరలింపుఏర్పాట్లు, ఇంటి పన్నుల డిమాండ్ నోటీసుల జారీ ,ఇతర అబివృద్ధి పనుల ఆంశాల పై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా తగు సలహాలు, సూచనలు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా పురపాలిక చైర్ పర్సన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ పురపాలిక అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలిసిమెలిసి ఉండి పట్టణ సమస్యలను ఎప్పుడికప్పుడు పరిష్కరిస్తు పట్టణ అబివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో మేనేజర్ మదుసూదన్, జూనియర్ అసిస్టెంట్ శ్రీరాంనాగేశ్, శ్రీనివాసరావు, శానిటెరి ఇన్స్‌పెక్టర్ సల్ల మురళీ, వార్డు అదికారులు,పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## భూనిర్వాసిత రైతులకు భూములివ్వాలి

**-రైతు రక్షణ సమితీ నాయకులు**

**నర్సాపూర్ జూన్ 22. ప్రభాతవార్త :** సంగారెడ్డి కెనాల్ రీచ్ 2 లో భూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతులకు భూఐములకు బదులుగా భూములు ఇవ్వాలని జిల్లా రైతురక్షణ సమితీ గౌరవ అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్యయాదవ్, జిల్లా అద్యక్షులు పత్రాల యాదాగౌడ్ లు డిమాండ్ చేశారు. నర్సాపూర్ పట్టణంలోని రైతువేదిక కార్యాలయంలో భూనిర్వాపిత రైతుల సమావేశంలో పాల్గొన్న నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగారెడ్డి కెనాల్ రీచ్ 2 లో భూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతులకు భూమికి బదులు భూముల ఇవ్వాలని లేని సక్షంలో ఎకరాకు 60 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం భూముల ధరలు అధికంగా ఉన్నందున తక్కువ ధరలకు భూముల తీసుకుంటే రైతులు నష్ట పోతారని అన్నారు. ఈ మేరకు భూనిర్వాసిత రైతులకు సరియైన ధరలు ఇచ్చిన్యాయం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో బ్రాహ్మణపల్లి, చెన్నాపూర్,బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15న రైతు రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం

**-రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయం**

**-జిల్లా కిసాన్ సెల్ సంఘం అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కిసాన్ సెల్ సంఘం అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, జూన్22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని ఇచ్చిన హామీల్లో భాగంగా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీపి కబురు చెప్పిందని మెదక్ జిల్లా కిసాన్ సెల్ సంఘం అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కాకముందే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఆరు గ్యారెంటీలు అమలు కాలేదని విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు కనీసం ఎన్నికల కోడ్ ఉందని కూడా తెలువని దుస్థితిలో వారున్నారని విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉండి రైతులకు అన్ని రకాలుగా ఆదుకుంటామని ప్రగల్భాలు పలికిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా రైతులకు రుణమాఫీ చేయలేదని ఆయన విమర్శించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ పార్టీ పదేండ్లుగా స్వామినాథన్ కమిటీ సఫార్సులను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీని విమర్శించే వారు ఒళ్లు దగ్గర పెట్టుకొని విమర్శించాలని ఆయన హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ఎన్నికల్లో హామీలు అన్నింటినీ తూచ తప్పకుండా అమలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు రుణ మాఫీకి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి దామోదర రాజనరసింహా, నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు, పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవింద్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్ మోల్సాబ్, కిషన్‌గౌడ్, సిద్ధిరాములుగౌడ్, అశోక్‌రెడ్డి, దాయర రవి తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

**-మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ నాయకుల వినతి**



మంత్రి కొండా సురేఖ కు వినతి పత్రం ఇస్తున్న నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి,కాంగ్రెస్ పార్టీజిల్లా అధ్యక్షులు ఆంజనే యులుగౌడ్ లు

**నర్సాపూర్ జూన్ 21. ప్రభాతవార్త :** నర్సాపూర్‌నియోజకవర్గ అభివృద్ధికి గాను నిధులు కేటాయించాలని కోరుతూ శనివారం హైంద్రాబాద్‌లో ని సచివాలయంలో రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మెదక్ జిల్లా ఇంచార్జీ మంత్రి కొండా సురేఖ ను కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ లు మర్యాధ పూర్వకంగా కలిశారు ఈసందర్భంగా నర్సాపూర్ ఇయోజకవర్గం అభివృద్ధి చేసెందుకుగాను నిధులు కేటాయించాలని మంత్రి కొండా సురేఖ కు వారు వినత పత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన మంత్రి కొండా సురేఖ నర్సాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని సానుకూలంగా సమాదానమిచ్చింది.ఈ మేరకు నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిదులు కేటాయిస్తానని మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందించి నందులకు గాను కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనే యులుగౌడ్‌లు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ధరణి భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**-కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మానిక్**

**సంగారెడ్డి టౌన్, జూన్ 22, ప్రభాతవార్త:** ధరణి భూ సమస్యలను త్వరగ పరిష్కరించాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమే మానిక్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానిక్ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లోని మండలాల్లో రెవిన్యూ అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని మానిక్ డిమాండ్ చేశారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, శ్రీకాంత్, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే

**సంగారెడ్డి టౌన్, జూన్ 22, ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని పంచాయితీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారులతో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శనివారం సంగారెడ్డిలోని తన క్యాంప్ కార్యాలయంలో అభివద్ధి పనులపై సమీక్షించారు. నియోజకవర్గంలోని 4 మండలాలలకు మంజూరైన నిధుల వివరాలు, కొనసాగుతున్న పనుల తీరును అధికారులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులపై చర్చించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పసల్వాది మంజీరా వంతె వద్ద చెక్ డ్యాం నిర్మాణ పనులపై చర్చించారు. నియోజకవర్గంలోని చెక్ డ్యాములు, మల్కాపూర్‌పెద్ద చెరువుపై వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మరమ్మత్తులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, అధికారులు దీపక్, బాల గణేష్, రవీందర్, శశాంక్, కొండ్‌రెడ్డి, జీవి శ్రీనివాస్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూరులో ఘనంగా ఏరువాక

**చౌటకూరు, జూన్ 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరుతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని రైతులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. రైతులు తాము సాకుతున్న పశువులకు శుభ్రంగా కడిగి రంగులు అద్ది రంగు రంగు తాళ్లతో అలంకరించి గ్రామాల్లోని ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## మండలంలో ఘనంగా ఏరువాక వేడుకలు

**అల్లాదుర్గం, జూన్ 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంతో పాటు మండలంలోని గడిపెద్దాపూర్, ముస్లాపూర్, చిల్వర్, చేవెళ్ల, కాయితంపల్లి, బహిరన్‌దిబ్బ, ముప్పారం, మాందాపూర్ తదితర గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని రైతులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. రైతులు సాకుతున్న పశువులను కడిగి రంగులు అద్ది రంగు రంగు తాళ్లలో అదంగా అలంకరించి ఆలయాల చుట్టూ ప్రదక్షణిలు చేయించి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## మాజీ మండల విద్యాశాఖ అధికారి లక్ష్మారెడ్డి మృతి

**రామాయంపేట, జూన్ 22, ప్రభాతవార్త ః** రామాయంపేట మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసిన పెంటపర్తి లక్ష్మారెడ్డి శుక్రవారం నాడు చికిత్స పొందుతూ మృతి చెందారు. అయితే లక్ష్మారెడ్డి రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామ వాస్తవ్యులు. సొంత మండలంలో ఉన్న పాఠశాలలో సుమారు 30 సంవత్సరాల పాటు పనిచేసి పదోన్నతి ద్వారా రామాయంపేట మండల ఎంఈఓగా పదవీ బాధ్యతలు చేపట్టడం జరిగింది. 2005 నుండి 2010 వరకు పనిచేయడం జరిగింది. ఆ కాలంలో ఆయన ఎంఈవో గా అందరి మన్ననలు పొందారు.

**పలువురి సంతాపం...ః**

విశ్రాంత ఎంఈఓ లక్ష్మారెడ్డి మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. వారిలో టిపిటిఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు జె.రామచంద్రం, పి. మధుసూదన్‌రెడ్డి, ఎ.రమేష్, పి. రాజయ్య, జి. రామచంద్రారెడ్డి, ఎంవి. సురేందర్, పాతూరి కిరణ్, పి. మల్లేశం, ఎన్. శ్రీకాంత్, రవి సంజీవ్, పి. సుధాకర్, వరంగల్ శ్రీనివాస్, కె. శ్రీనివాస్‌లు ఉన్నారు.

## రైతులు కాంగ్రెస్‌కు రుణపడి ఉంటారు

**రామాయంపేట, జూన్ 22, ప్రభాతవార్త ః** తెలంగాణ ముఖ్యమంత్రి ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామంటూ ప్రకటించడం శుభపరిణామం అని తెలంగాణ రైతురక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేనప్పటికీ ప్రభుత్వం రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని సుధీర్ఘంగా చర్చింది శుభవార్త తెలిపారన్నారు. రైతులంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో గెదె మృతి

**సిర్గాపూర్, జూన్ 22, ప్రభాతవార్త:** విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పాడి గెదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కడ్పల్‌లో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. విద్యుత్ తీగలు నేలకు తాకేలా వంగి ఉన్నా అదికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిం చడం,



కరెంట్ షాక్‌తో గెడె మృతి చెందిన దృశ్యం

పలు మార్లు సమస్యను పరిష్కరించాలని వినతి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధితుడితో పాట గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పొలాల కు వెళ్లే తరుణంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పోవాల్సి వస్తోందని, విద్యుత్ తీగలను సరిచేయాలని ప్రాదేయపడినా పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. గెదెను కోల్పోయిన రైతుకు విద్యుత్ అధికారులు నష్ట పరిహారం అందించి, నేలకు తాకుతున్న విద్యుత్ తీగలను సరిచేయలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఆరుద్ర కార్తె వచ్చినా...వానల కోసం

**సిర్గాపూర్, జూన్ 22, ప్రభాతవార్త:** ఆరుద్ర కార్తె వచ్చినా వానల కొరకు రైతులు ఆకాశం వైపు కళ్లు కాయాలు కాచేలా ఎదురు చూస్తూ ఉండక తప్పడం లేదు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఆశించినంతగా వర్షాలు పడకపోవడంతో విత్తుకున్న విత్తనాలు ఎక్కడ మొలకెత్తవో అని రైతులు దిగాలు చెందుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు వరి నార్లు వేయలేదంటే అనావృష్టి ఏర్పడిందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వర్షాలు సకాలంలో అనుకున్న మేర కురిస్తే రైతులు తమ వ్యవసాయ భూముల్లో నారు వేసే పనిలో బిజి బిజీగా ఉండేవారు. బోరు సౌకర్యం ఉన్న రైతులు మాత్రమే కొందరు నారు వేసినట్లు కానవస్తోంది. రైతులు వర్షాల కొరకు కండ్లు కాయలు కాచేలా ఎదరు చూస్తున్నారు. వరుణ దేవుడు వర్షాలు కురిపంచి రైతులను ఆదుకుంటాడని ఆశిద్దాం.

## నరేంద్ర మోడీ దిష్టి బొమ్మ దగ్ధం

**సిద్దిపేట జూన్ 22, ప్రభాతవార్త:** కోహేడ మండల కేంద్రంలో నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దూలం శ్రీనివాస్ గౌడ్ ఆద్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన నీట్ పరీక్ష లీకేజీ వలన సుమారుగా 30 లక్షల మంది జీవితాలతో చెలగాటం ఆడారని అన్నారు. రెండు దేశాల మధ్య జరిగే యుద్దాన్ని ఒక్క ఫోన్ కాల్‌తో ఆపానని ప్రలోభాలు పలికిన నరేంద్ర మోడీ పేపర్ లీకేజీ ఎందుకు ఆపాలేక పొయరన్నారు. రానున్నా రోజులలో కాంగ్రెస్ నాయకులు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రంలో మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బీమ్ రెడ్డి, తిరుపతి రెడ్డి, గూడ స్వామి, బైరి సుధాకర్, చెన్నా రెడ్డి, హుస్నాబాద్ అసెంబ్లీ సెక్రటరీ మంజు శివసాయి గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఏళ్లబోయిన శ్రీకాంత్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆవుల మహేంద్ర, గరేపల్లి ప్రశాంత్, పెద్ది రంజిత్, రాజేందర్ రెడ్డి, సంజీవ్ పటేల్, సురేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## ఏఆర్ కానిస్టేబుల్ గురునానక్ సస్పెండ్

**సిద్దిపేట జూన్ 22, ప్రభాతవార్త:** పి. గురునానక్, ఏఆర్ కానిస్టేబుల్ పోలీస్ డిపార్ట్మెంట్ సీసీఏ రూల్స్ అతిక్రమించి క్రమశిక్షణ రహితంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలు రాగా విచారణ జరిపిన తదనంతరం శనివారం సస్పెండ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేసిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి, అనురాధ సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్మెంట్లో క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. క్రమశిక్షణ రహితంగా విధులు నిర్వహించే అధికారులను, సిబ్బందిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## భూముల కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లిస్తాం

**-నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి**

**నర్సాపూర్ జూన్ 22. ప్రభాతవార్త :** సంగారెడ్డి కెనాల్ రీచ్ 2 లో భూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతులకు ప్రభుత్వ నిభందనల మేరకు నష్ట పరిహారం చెల్లిస్తామని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శ్దనివారం నర్సాపూర్ పట్టణంలోని రైతు వేధిక భవనంలో సంగారెడ్డి కెనాల్ రీచ్ 2 లో భూములు కోల్పోతున్న నర్సాపూర్ మండల పరిధిలోని చిన్నచింతకుంట, చిప్పల్‌తుర్తి గ్రామాలకు చెందిన భూనిర్వాసితుల రైతులతో అవార్డు విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భూనిర్వాసిత రైతుల తమ అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని అధికారుల కోరడం జరిగింది. ఈమేరకు భూనిర్వాసిత రైతులు ప్రస్తుతం భూముల దరలు చాలా ఎక్కువగా ఉన్నందున ఎకరానికి 60 లక్షలు ఇవ్వాలని లేనిపక్షంలో భూమికి బదులు భూములు ఇవ్వాలని వారు కోరారు.ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి కెనాల్ రీచ్ 2 లో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు ప్రభుత్వ నిభందనల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారాన్ని చెల్లించడం జరుగుతుందన్నారు.భూనిర్వాసితులు తెలిపిన అభ్యంతరాలను నిర్ణయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయించడం జరుగుతందని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతులు, అదికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని పండగ చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**-రుణమాఫీ చేస్తామని నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం**

**: టిపిసిసి చేనేత విభాగం చైర్మన్ శ్రీనివాస్**

**సిద్దిపేట రూరల్, జూన్ 22, ప్రభాతవార్త :** వ్యవసాయాన్ని పండుగ చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టిపిసిసి చేనేత విభాగం చైర్మన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరి శ్రీనివాస్(ఎస్టిడి) అన్నారు. శనివారం ఆయన సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. ఒకే దఫాలో రైతు రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల అయన హర్షం వ్యక్తం చేశారు. 2022లో వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులలకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని నిర్ణయించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన మాటనును నిలబెట్టకోవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అగస్టులోగా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రుణ మాఫీ చేసి తీరుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. రైతులకు అగస్టులోపు రూ. 2లక్షల రుణ మాఫీ చేస్తామని నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర మంత్రి వర్గానికి అయన కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి పనులు సమీక్షించిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, జూన్ 22, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలోని వార్డ్ కార్యాయంలో శనివారం కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఇంజనీరింగ్ డీఈ నరేందర్, ఏఈ ప్రభు, విద్యుత్ ఏఈ లిఖిత, సిబ్బందితో కలిసి సండే మార్కెట్ బస్ రూట్, హిందూ స్మశాన వాటిక నుంచి మైనార్టీ శ్మశాన వాటిక వరకు సెంటర్ డివైడర్‌తో కూడిని సెంటర్ సెంట్రల్ లైటింగ్ కొరకు చర్చించారు. గ్రంథాలయం నుంచి ఈఎస్ఐ రోడ్డ వరకు 10 మీటర్ల రోడ్డు నిర్మించాలని, రోడ్డు వేశక డివైడర్, లైటింగ్‌లు అమర్చి రామచంద్రాపురం గ్రామానికి ముఖ ద్వారముగా చేసి అందంగా చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్థంబాలను తొలగించాలని సూచించారు. డివిజన్ పరిధిలో విద్యుత్ బల్బుల కొరత ఉందని, రాత్రిల్లు బల్బులు లేక అంధాకారంగా కాలనీలు ఉంటున్నాయని, ఫలితంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, అందుకు 300 విద్యుత్ బల్బులను అమర్చాలని విద్యుత్ ఏఈ లిఖితను ఆదే కార్పోరేటర్ ఆదేశించారు.

**-సిసి రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించిన కార్పోరేటర్...**

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో సండే మార్కెట్ వద్ద 40 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ శనివారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణం పనులు నాణ్యతగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**చౌటకూరు, జూన్ 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అందుకుంటున్న 250 మంది విద్యార్థులకు శనివారం ప్లష్ అకాడమీ నిర్వాహకులు స్టడీ మెటీరియల్ (బ్యాగులు, గొడుగులు, నోట్ బుక్స్, పెన్నులు, కంపాక్స్ బాక్సులు) అందచేశారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించాలని తాజీ మాజీ సర్పంచ్ పోలీస్ సతీష్‌కుమార్ తన స్నేహితులైన ప్లషన అకాడమీ చైర్మన్ కె సంతోషి శ్రీకర్, కే శివశ్రీకర్ ప్రసాద్‌ల దృష్టికి తేగా స్పందించిన సంతోష్ శ్రీకర్, కే శివశ్రీకర్‌లు హైద్రాబాద్ నుంచి సమాగ్రిని గ్రామనికి తరలించి విద్యార్థులకు అందచేశారు. స్టడీ మెటీరయల్‌ను అందచేసిన దాతలకు విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ సతీష్‌కుమార్‌లు సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

## తుకం ఎండుతుంది...



గజగట్లపల్లిలో తుకానికి ట్యాంకర్ ద్వారా నిళ్లు అందిస్తున్న రైతు యాదగిరి

**చిన్నశంకరంపేట,జూన్ 22,ప్రభాతవార్త:** వరి పొలాలలకు నిళ్లు లేక అన్నధాతకు కన్నీళ్లే మిగులుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనా వరుణుడు కరుణించకపోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. గత వారం రోజుల క్రితం కురిసిన వర్షానికి అన్నధాతలు దుక్కి దున్ని వరి నాడు పోశారు. తీరా వర్షాలు కురవక పోవడంతో చేసేది లేక ట్యాంకర్ల ద్వారా నిటిని తెచ్చి వానుమడికి నీరు పోస్తున్నారు. గజగట్లపల్లికి చెందిన రైతు యాదగిరి తనకున్న ఐదు ఎకరాల పొలంలో మూడు ఎకరాలకు పైగా వర్షాదార పంటలను పండిస్తాడు. గత వారం రోజుల క్రితం కురిసిన వర్షానికి దుక్కి దున్ని నారు పోసి ఉంచాడు. వరుణ దేవుడు కరుణించకపోవడంతో వరి నారు ఎండిపోతుందని ఆవేదన చెంది ట్యాంకర్ల ద్వారా నీటిని తిసుకొచ్చి వరి నారుకు పోస్తున్నాడు. రెండు రోజులకు ఒక ట్యాంకర్ తిసుకోస్తున్నానని, ఒక్కో ట్యాంకర్‌కు రూ.600 వరకు ఖర్చు అవుతుందని రైతు వాపోయాడు. ఇప్పటికే పంట పెట్టుబడి 50వేలు ఖర్చు అయిందని, మరో వారం రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే తీవ్రంగా నష్టపోతామని కన్నీటి పర్యంతమయ్యాడు.

## ప్రజా పాలన షురూ....

**చిన్నశంకరంపేట,జూన్ 22,ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాలు దరఖాస్తు చేసుకొని లబ్ధిదారులు తిరిగి దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీవో దామోదర్ తెలిపారు. శనివారం చిన్నశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలి రోజు 80 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం కింద వంట గ్యాస్ సబ్సిడి కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు తప్పనిసరిగా ధరఖాస్తులను పూర్తి చేసి, ఆదార్ కార్డు జిరాక్స్ అందించాలని తెలిపారు.

## చిన్నారులకు బ్యాగుల పంపిణీ



రెడ్డిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారులకు బ్యాగులను అందించిన దృశ్యం

**నర్సాపూర్ రూరల్,జూన్ 22,ప్రభాతవార్త:** మండల పరిధి రెడ్డిపల్లి గ్రామంలో శనివారం నాడు అంగన్‌వాడి చిన్నారులకు బ్యాగులను మాజీ ఉప సర్పంచి అశోక్‌గౌడ్ అందించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి సహకారంతో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడుతామని ఆయన తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్ గౌడ్, నర్సాపూర్ మండల ఒబిసి సెల్ జనరల్ సెక్రటరీ మహేష్‌గౌడ్, ఆర్ కెగౌడ్, సోమని రాగుగౌడ్, సోమని వెంకటేష్‌గౌడ్, విష్ణు, ఆంజనేయులు, అజీం, నవీన్, ప్రధానోపధ్యాయులు తార సీంగ్, ఉపాధ్యాయులు రామక్రిష్ణ, అనురాధ, రాధిక, శ్వేత,శ్రీనివాస్‌గౌడ్,వాని,శేఖర్ తదితరులు పాల్గోన్నారు.

## నాచగిరి క్షేత్రంలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ్మాస్వామి

**వర్గల్, జూన్ 22 (ప్రభాతవార్త):** వర్గల్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ్మాస్వామి క్షేత్రం శనివారం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవుదినం కావడంతో శనివారం వివిధ ప్రాంతాల నుండి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా విరజిల్లుతున్న లక్ష్మీనృసింహ్మాస్వామి క్షేత్రంలో భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, స్వామివారి కళ్యాణాలు, నిజాబిషేకాలు పెద్దసంఖ్యలో జరిపించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.